
చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



# 17 నెలలు... రూ.20 లక్షల కోట్లు!





రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు... పెట్టుబడులను తెచ్చేలా పూర్తిస్థాయిలో దృష్టి సారించాం. ప్రభుత్వం ఏర్పాటైన 17 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలిగాం. విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం. ప్రధాని మోదీ ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారు. 2038కి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. 2047కు భారతదేశం అగ్రస్థానంలోకి రావటాన్ని ఎవరూ ఆపలేరు. రాష్ట్రాభివృద్ధి కోసమే ఓ విజన్ తయారు చేసుకుని అమలు చేస్తున్నాం. దేశంలోని నాలుగు నగరాలకు విజన్ తయారు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ముంబై, వారణాసి, సూరత్, విశాఖవంటి నగరాల అభివృద్ధికి విజన్ రూపొందించాలని సూచించింది. ఈమేరకు ప్రస్తుతం రూపొందించుకున్న విజన్ అమలు చేయాలని నిర్ణయించింది. అక్షర క్రమంలో, అభివృద్ధి పోటీలో ఏపీనే ఎప్పుడూ ముందుంటుంది.

**వీఈఆర్ -2040 మాస్టర్ ప్లాన్ రూపకల్పన సదస్సులో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన**



విశాఖ ఎకనమిక్ రీజియన్ డాక్యుమెంట్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం



3

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. రెన్యూ పవర్ వ్యవస్థాపక ఛైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా నేతృత్వంలోని రెన్యూ పవర్‌తో నాలుగు ప్రధాన ప్రాజెక్టులలో దాదాపు రూ.60వేల కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. గత మే 2025లో రెన్యూ పవర్ రూ.22,000 కోట్లమేర పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే చేసుకున్న ఒప్పందానికి ఇది అదనం. ఈ పెట్టుబడులలో 6 జిడబ్ల్యు సోలార్ ఇంగోట్ మరియు వేఫర్ తయారీ సౌకర్యం, 300 కెటిపీఏ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్, 2 జిడబ్ల్యు పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 5 జిడబ్ల్యు పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్లాంట్ ఉన్నాయి. ఈ ఒప్పందాలు క్లీన్ ఎనర్జీ ఉత్పాదనలో ఏపీ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్తాయి. రాష్ట్రంలోని నైపుణ్యవంతులైన యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయి.

**-సీఎం చంద్రబాబు నాయుడు**

# పోటెత్తిన పెట్టుబడులు!




- భాగస్వామ్య సదస్సుకు ముందే భారీగా ఎంఓయూలు
- రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.26 లక్షలమందికి ఉద్యోగాలు
- ఇంధన శాఖలోనే రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన సంస్థలు
- ఏపీని విడిచి వెళ్లిన కంపెనీలను తిరిగి తెచ్చిన కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వం చేపట్టే అన్న క్యాంటీన్లకు భారీగా విరాళాలు
- వేగమే వేదంగా పెట్టుబడుల సాధనకు కృషి: సీఎం
- రోజంతా 15కు పైగా సమావేశాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

(పూర్తి కథనాలు లోపలి పేజీలలో)

వేగమే వేదంగా -పెట్టుబడుల సాధనకు కృషి చేస్తున్నానన్న సీఎం చంద్రబాబు.. సీఐఐ భాగస్వామ్య సదస్సు ఆరంభానికి 24 గంటలుముందే 'ఔరా!' అనిపించారు. రెండు రోజులపాటు జరిగే భాగస్వామ్య సదస్సుతో దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించగలమన్న ధీమాను వ్యక్తం చేస్తూనే.. 24గంటలు ముందే రాష్ట్రానికి పెట్టుబడుల వరదను రుచి చూపించారు. గురువారం ఏకబిగిన భేటీలు నిర్వహించి.. ఎకాఎకిన రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోవడమే కాదు.. 1.26 లక్షలమందికి ఉద్యోగ ఉపాధి మార్గాలకూ బాటలు వేశారు.

# గ్లోబల్ చూపు.. ఏపీవైపు!

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్సే మన సక్సెస్
- పారదర్శక పాలనతోనే గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ పెట్టుబడులు
- అన్నిరంగాల్లో ఏపీని నెం.1గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- మరికొన్ని ఐటి జెయింట్స్ త్వరలో విశాఖపట్నానికి రాక
- నెలాఖరుకే గూగుల్ ఏఐ హబ్‌కు శంకుస్థాపన చేస్తాం
- ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం
- 30వేల ఉద్యోగాలు కల్పించే 5 సంస్థలకు మంత్రి లోకేష్ భూమిపూజ

5

# తూర్పు తీరాన ఐటీ మేళా!

6లో



ముఖ్యమంత్రి చంద్రబాబుతో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సీఎండీ రాహుల్ ముంజాల్ భేటీ. రూ.15వేల కోట్ల పెట్టుబడితో 4 గిగావాట్ల విద్యుదుత్పత్తికి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది.

## మహా వితరణ



ప్రముఖ ఫర్నిచర్ సంస్థ బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ ఛైర్మన్ ఎన్‌కే అగర్వాల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.కోటి విరాళాన్ని అందించారు.

## అమోఘ ఆరంభం



సీఐఐ సదస్సుకు రోజు ముందే.. తూర్పుతీరాన ఐటీ మేళా సాగింది. 5 కంపెనీలకు ఐటీ మంత్రి భూమిపూజ చేశారు. మధురవాడ ఐటీ హిల్ నెం.2లో ఐ-స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేష్



సీఎం చంద్రబాబుతో కోరమండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ అలగప్పన్, ఎండీ, సీఈఓ శంకర సుబ్రమణియన్. రాష్ట్రంలో ఎరువుల తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కోరమండల్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

# భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు

- అనేక రంగాల్లో పెట్టుబడులకు అనువైన ప్రాంతం ఏపీ
- గ్రీన్ ఎనర్జీరంగంలో ముందున్నాం...
- షిప్‌బిల్డింగ్ యూనిట్లకు ప్రాధాన్యమిస్తున్నాం
- ఇండియా-యూరప్ బిజినెస్ పార్టనర్షిప్ రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం చంద్రబాబు




విశాఖపట్నం (చైతన్య రథం): రాబోయే కాలంలో ఏయే రంగాలకు ప్రాధాన్యత ఉంటుందో గుర్తించి.. ఆయా రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులు పెట్టడానికి అనువైన ప్రాంతంగా ఉంటుందని వెల్లడించారు. గురువారం విశాఖలో ఇండియా-యూరప్ బిజినెస్ పార్టనర్షిప్ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సుస్థిరాభివృద్ధిలో భారత్-యూరప్ దేశాల మధ్య సహకార భాగస్వామ్యంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆర్మేనియా ఆర్థిక వ్యవహారాల మంత్రి గివార్గ్ పొపాయాన్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, అర్మేనియా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు, భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్ అమిత్ కళ్యాణి సహా వివిధ కంపెనీలకు చెందిన ఛైర్మన్లు, సీఈఓలు, సీఐఐ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు.. ఇంటరాక్షన్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి వివిధ అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "విశాఖ అద్భుతమైన సాగర తీర నగరం, మంచి వనరులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అమెరికా వెలుపల గూగుల్ అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను విశాఖలోనే ఏర్పాటు చేస్తోంది. సబ్ సీ కేబుల్ కూడా ఈ ప్రాంతం నుంచే ఏర్పాటు అవుతోంది. గతంలో ఐటీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రోత్సహించాం. గూగుల్, ఆడోబ్, మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద సంస్థల సీఈఓలుగా భారతీయులే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక సంస్కరణల తర్వాత పరిస్థితులు అన్నీ మారిపోయాయి. జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. వాటికి అనుగుణంగా సంపద పెరగాల్సి ఉంది. దీని కోసం ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల పరిశ్రమల్ని ప్రోత్సహిస్తున్నాం. కేంద్రం ప్రారంభించిన భారత్ క్వాంటం మిషన్ నుంచి అవకాశాలను అందిపుచ్చుకున్నాం... దేశంలో తొలి క్వాంటం వ్యాలీని ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం. అలాగే డ్రోన్ల వినియోగం... వివిధ రంగాల్లో పని చేసే వారికి... అలాగే డిఫెన్సు రంగంలో ఉన్న వారికి ఉపయోగపడాలి. వీటి తయారీ పెరగాలి. అందుకే ఏపీని డ్రోన్ తయారీకి కేంద్రంగా చేయాలని భావిస్తున్నాం. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. స్పేస్ అప్లికేషన్లు కూడా రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఏపీలో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

### పోర్టులే మా బలం

"ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ ప్రాధాన్యం కూడా పెరిగింది. సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో ఏపీ బలంగా ఉంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్ 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రయత్నిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా భూతాపం వల్ల ప్రకృతి విపత్తులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. క్లౌడ్ బరస్ట్ లాంటి ప్రకృతి విపత్తులతో నగరాలు నీట మునిగే పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. 40 సెంటిమీటర్ల వర్షపాతం ఒకే చోట పడుతోంది. గ్లోబల్ వార్మింగ్ వల్లే ఈ ఉత్పాతాలు సంభవిస్తున్నాయి. అందుకే మనం అంతా కలిసి గ్రీన్ ఎనర్జీ వైపు ముందడుగు వేయాలి. ప్రస్తుతం సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పనిచేస్తోంది. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తయారవుతుంది. ఏపీకి వస్తున్న డేటా సెంటర్లకు కూడా గ్రీన్ ఎనర్జీని సరఫరా చేస్తాం. మనం అంతా కలిసి మానవాళి సంక్షేమానికి పనిచేద్దాం. అలాగే పోర్టు రవాణా రంగంలో ఏపీలో అవకాశాలు ఉన్నాయి. పెద్ద ఎత్తున పోర్టులను నిర్మిస్తున్నాం. పోర్టులను వివిధ నెట్వర్క్ లకు అనుసంధానిస్తున్నాం. రైల్వే, ఎయిర్ పోర్టులతో పాటు.. దేశాల్లోని వివిధ ప్రధాన నగరాలకు ఏపీలోని పోర్టులతో అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రస్తుతం భారత్ దేశం నౌకా నిర్మాణంలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉంది. ఈ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం. నౌకా నిర్మాణ రంగంలో అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలి కోరుతున్నాం."అని సీఎం చెప్పారు.

### ఎస్కార్ట్ ఆఫీసర్లను పెడతాం... పారిశ్రామిక వేత్తలకు ఇబ్బంది లేకుండా చూస్తాం

"స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానాన్ని అమలు చేసి యుద్ధ ప్రాతిపదికన అనుమతులు ఇస్తున్నాం. కేవలం 45 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి త్వరితగతిన ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నాం. గూగుల్ కూడా రెండు మూడు రోజుల్లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించబోతోంది. వారికి కూడా చాలా కొద్ది రోజుల్లోనే అనుమతులిచ్చాం. ప్రోత్సాహకాలు, వేగంగా అనుమతులు ఇవ్వటంలో ఏపీకి పోటీ లేదు. పెట్టుబడులతో ముందుకు వస్తే చాలు ఎస్కార్ట్ ఆఫీసర్‌ను నియమించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా సహకరిస్తాం. ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించడానికి ఆంధ్రప్రదేశ్ గేట్ వే గా ఉంటుంది. పారిశ్రామిక ఉత్పత్తులు, విద్య, వైద్యం, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్గానిక్ ఆహార ఉత్పత్తుల రంగంలోనూ కీలకంగా పని చేస్తున్నాం. ప్రకృతి సేద్యంలో పండించిన అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్ గా మారింది. ఏపీలో ఉన్న అవకాశాలను పరిశీలించి... ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని యూరోప్ దేశాల్లోని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాను. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థాయి దేశంగా మారుతుంది, అందులో ఏపీ ముందుంటుంది."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.





# టూరిజం డెస్టినేషన్ విశాఖ

- అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం
- నౌకాదళ కార్యకలాపాలకు సంపూర్ణ సహకారం
- వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాతో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈస్టర్న్ నావల్ కమాండ్ కమాండింగ్ ఇన్ ఛీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా భేటీ అయ్యారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని సంజయ్ భల్లా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నౌకాదళ కార్యకలాపాలపై వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ముఖ్యమంత్రి వివరించారు. రక్షణ వ్యవస్థలో కీలకమైన భారత నౌకాదళానికి సేవలు అందించే కంపెనీలు, స్టార్టప్‌లను రాష్ట్రానికి ఆహ్వానించే అంశంపై ఇరువురు మధ్య చర్చ జరిగింది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వదేశీ నౌకా నిర్మాణం, నౌకా సాంకేతికతకు తోడ్పాటును అందించేలా ప్రయత్నం చేస్తున్నట్లు సీఎం తెలిపారు. తూర్పు నావికా దళం నిర్వహించే ఫ్లీడ్ రివ్యూలకు ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విశాఖ అనేక అవకాశాలకు, ప్రతిష్టాత్మక సంస్థలకు కేంద్రం కాబోతుందని అన్నారు. విశాఖ భవిష్యత్ నగరంగా మారుతోందని... దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం, నావీ కలసి పనిచేయాలని అన్నారు. విశాఖ నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా కానుందని... ఇదే సమయంలో విశాఖను అత్యుత్తమ టూరిజం సెంటర్‌గా కూడా తీర్చిదిద్దేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి తూర్పు నావికాదళం సహకారాన్ని అందించాలని సీఎం కోరారు.



నావీ అంటే కేవలం ఫైటింగ్ ఫోర్స్ మాత్రమే కాదని... నావికా దళ విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. నావీ మ్యూజియం వంటివి ఏర్పాటు చేయడం ద్వారా యువతకు రక్షణ రంగంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఏపీలో రక్షణ రంగంలో చేరేందుకు యువత చూపుతున్న ఆసక్తి ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నావీ చేపట్టే వివిధ ప్రాజెక్టులకు, కార్యకలాపాలకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని సిఎం చంద్రబాబు వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాకు తెలిపారు.

చైతన్యరథం

# ఎరువుల ఫ్యాక్టరీకి కోరమండల్ రెడీ





- రాష్ట్రంలో ప్రాజెక్టు ఏర్పాటుకు సంసిద్ధత
- రూ.2,000 కోట్ల పెట్టుబడికి అంగీకారం
- అన్న క్యాంటీన్లకు బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ రూ.కోటి విరాళం
- సీఎం చంద్రబాబుతో వివిధ సంస్థల ప్రతినిధుల భేటీలు

విశాఖపట్నం (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖలో వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని పెట్టుబడులకున్న అవకాశాలను వివరించడంతోపాటు.. పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నారు. అలాగే ప్రతిపాదనలతో వచ్చిన వారితో ఈడీబీతో ఎంఓయూలు కుదుర్చుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎరువులు, అగ్రి-ఇన్‌పుట్ సంస్థ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎరువుల తయారీ విస్తరణ, గ్రీన్ అమోనియా, అగ్రిటెక్ ప్రాజెక్టులపై ఆ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. మురుగప్ప గ్రూప్‌నకు చెందిన కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థకు ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడలో ఎరువుల ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. దీనికి కొనసాగింపుగా మరో రూ.2,000 కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో ఎరువుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. గ్రీన్ అమోనియా - గ్రీన్ హైడ్రోజన్ తయారీ, ఎరువుల ఉత్పత్తి యూనిట్ విస్తరణ సహా ఇంకొన్ని ప్రాజెక్టులపై కోరమండల్ సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. మరోవైపు ప్రముఖ ఫర్నిచర్ సంస్థ బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ ఛైర్మన్ ఎన్‌కే అగర్వాల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. కలప ఆధారిత ఇంజినీర్డ్ ప్యానెల్ తయారీ యూనిట్ ఏర్పాటుపై చర్చించారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్నా క్యాంటిన్ల నిర్వహణకు ఎన్‌కే అగర్వాల్ రూ.1 కోటి విరాళాన్ని ముఖ్యమంత్రికి అందించారు.

# 17 నెలలు... రూ.20 లక్షల కోట్లు!



- గ్లోబల్ డెస్టినేషన్‌గా విశాఖ ఎకనమిక్ రీజియన్
- పోర్ట్ ఆధారిత అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్
- వీఈఆర్ 2040 మాస్టర్ ప్లాన్ రూపకల్పన సదస్సులో సీఎం చంద్రబాబు
- విశాఖ ఎకనమిక్ రీజియన్ డాక్యుమెంట్ విడుదల చేసిన సీఎం, నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం

విశాఖపట్నం (చైతన్య రథం): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు... పెట్టుబడులను తెచ్చేలా పూర్తిస్థాయిలో దృష్టి సారించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఏర్పాటైన 17 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నామని ప్రకటించారు. పెట్టుబడుల సదస్సుకు ముందు రోజైన గురువారం నిర్వహించిన విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సుకు సీఎం హజరయ్యారు. గ్లోబల్ ఎకనమిక్ హబ్‌గా విశాఖ రీజియన్ అభివృద్ధి చేసేలా రూపొందిస్తోన్న ప్రణాళికపై చర్చించారు. అలాగే విశాఖ ఎకనామిక్ రీజియన్ -2040 మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈ సదస్సు వేదికగా విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి, నీతిఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం. ప్రధాని మోదీ ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారు. 2038కి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. 2047కు భారతదేశం అగ్రస్థానంలోకి రావటాన్ని ఎవరూ ఆపలేరు. రాష్ట్రాభివృద్ధి కోసమే ఓ విజన్ తయారు చేసుకుని అమలు చేస్తున్నాం. దేశంలోని నాలుగు నగరాలకు విజన్ తయారు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ముంబై, వారణాసి, సూరత్, విశాఖవంటి నగరాల అభివృద్ధికి విజన్ రూపొందించాలని కేంద్రం సూచించింది. ఈమేరకు ప్రస్తుతం రూపొందించుకున్న విజన్ అమలు చేయాలని నిర్ణయించింది. అక్షర క్రమంలో, అభివృద్ధి పోటీలో ఏపీనే ఎప్పుడూ ముందుంటుంది. సాగరతీరాన ఉన్న విశాఖ నగరం దేశంలోనే అత్యంత సుందరమైన ప్రాంతం" అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.



## వాళ్లు పాడు చేశారు... మేం బాగు చేస్తున్నాం

"గత పాలకులు రాష్ట్రాన్ని, దాని అభివృద్ధిని సర్వనాశనం చేశారు. అందుకే కూటమిగా ప్రజల మద్దతుతో పునర్నిర్మాణం చేస్తున్నాం. రూ.3.65 లక్షల కోట్ల విలువైన ఎంఓయూలు సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్‌కంటే ముందే కుదుర్చుకున్నాం. రెండు రోజుల సదస్సులో మరిన్ని పెట్టుబడులపై ఒప్పందాలు కుదుర్చుకోబోతున్నాం. 17 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చే పరిస్థితికి ప్రస్తుతానికి ఏపీ చేరింది. గూగుల్ డేటా సెంటర్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో వస్తోంది. అనకాపల్లిలో దాదాపు రూ. లక్ష కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మించబోతోంది. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థిక శక్తిగా ఏపీని నిర్దేశించే ఓ మోడల్. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. విశాఖపట్నం ఇండస్ట్రియల్ రీజియన్ మాస్టర్ ప్లాన్ -2040కు రూపకల్పన చేశాం. తూర్పుతీరంలో వీఈఆర్ దేశ ఆర్థిక ప్రగతికి గేట్ వే. అన్ని వనరులున్న 9 జిల్లాలతో విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటైంది. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి చైర్మన్ హోదాలో నేనే స్వయంగా అభివృద్ధిని పర్యవేక్షిస్తాను. అలాగే ఈ రీజియన్‌కు పరిశ్రమల శాఖ కార్యదర్శి సీఈఓగా వ్యవహరిస్తారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో ఏరో సిటీని అభివృద్ధి చేస్తాం. ఇదే ప్రాంతంలో ఆక్వా సహా ఇతర రంగాలకు చెందిన పరిశ్రమలనూ ఆకర్షిస్తాం. పర్యాటకంతోపాటు హెల్త్ కేర్ రంగంలోనూ విశాఖ ఓ కేంద్రంగా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. పోర్టులు, పారిశ్రామిక కారిడార్‌లు, లాజిస్టిక్స్, నౌకా, రక్షణ పరిశ్రమలు, టూరిజం రంగాలను సమన్వయం చేస్తాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## పోర్టులే... ఏపీ అభివృద్ధికి హార్ట్

"రాష్ట్రాన్ని పోర్ట్ ఆధారితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. విశాఖ, గంగవరం, కాకినాడ, రామాయపట్నం పోర్టులను అనుసంధానం చేస్తున్నాం. తూర్పుతీర సముద్ర వాణిజ్యానికి విశాఖను ప్రధాన నోడల్ పాయింట్‌గా అభివృద్ధి చేస్తాం.
విశాఖ-శ్రీకాకుళం కారిడార్‌ను నౌకా నిర్మాణ హబ్‌గా తీర్చిదిద్దుతాం. సముద్ర ఆధారిత పరిశ్రమలు, మత్స్య పరిశ్రమ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నాం. తీర ప్రాంత ఆర్థిక కార్యకలాపాల ద్వారా సుస్థిర జీవనోపాధి అవకాశాలు సృష్టించడం మా ప్రభుత్వ విధానం. స్మార్ట్ లాజిస్టిక్స్, కనెక్టివిటీపై ప్రధానంగా దృష్టి పెట్టాం.
విశాఖ-కాకినాడ-రాజమండ్రి హైవే, రైల్వే లైన్లను మెరుగుపరుస్తాం. ఎయిర్ కార్గో, ఇండస్ట్రియల్ పార్కులు, ఎక్స్‌పోర్ట్ హబ్‌లను ఒకే ఎకో సిస్టమ్ కిందకు తీసుకువస్తాం. స్కిల్ విశాఖ ఇనిషియేటివ్ ద్వారా 1 లక్షమంది యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. మారిటైమ్, నావల్ సిస్టమ్ క్లస్టర్ రూపకల్పనలో కేంద్ర ప్రభుత్వ, నౌకాదళ, ప్రైవేట్‌రంగ భాగస్వామ్యం కోసం ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, డోలా బాల వీరాంజనేయ స్వామి, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మిడి సంధ్యారాణి, సీఎస్ విజయానంద్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు హజరయ్యారు.



# ఇటలీ రాయబారితో సీఎం చంద్రబాబు భేటీ

### ఇటాలియన్ ఇండస్ట్రీయల్ క్లస్టర్ ఏర్పాటుపై చర్చ

విశాఖపట్నం (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని కోరారు. విశాఖపట్నంలోని సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. ఈ భేటీల్లో భాగంగా గురువారం భారతదేశంలోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని ముఖ్యమంత్రి బార్టోలీకి వివరించారు. కీలక రంగాలైన ఆటోమోటివ్, ఆటో విడిభాగాలు, యంత్రాల తయారీ, ఇంధన, ఫ్యాషన్, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై ముఖ్యమంత్రి-ఇటలీ రాయబారి మధ్య చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యంత్రాలు, పునరుత్పాదక విద్యుత్



రంగం, నౌకానిర్మాణ రంగాలలో భాగస్వాములు కావాలని ఇటాలియన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఏపీ-ఇటలీ మధ్య దీర్ఘకాలిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఇటాలియన్ ఇండస్ట్రీయల్ క్లస్టర్ ను ఏర్పాటు చేసే అంశంపై సీఎం చంద్రబాబు-ఇటలీ రాయబారి బార్టోలీ మధ్య చర్చలు జరిగాయి.

# పెట్టుబడులకు మేం రెడీ

- పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు తైవాన్ కంపెనీల ఆసక్తి
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ
- సీఎం సమక్షంలో తైవాన్ ప్రతినిధి బృందంతో ఎంవోయూలు
- రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగుందన్న తైవాన్ ప్రతినిధి బృందం



విశాఖపట్నం (చైతన్య రథం): తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని తైవాన్ ప్రతినిధి బృందానికి సీఎం తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్‌లో తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృతంలోని తైవాన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని సీఎం తైవాన్ బృందానికి వివరించారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని సీఎం తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో - తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ముఖ్యమంత్రికి తెలిపింది. పాద రక్షల తయారీ కంపెనీ పౌ చెన్ గ్రూప్ ఫుట్ వేర్ యూనిట్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సార్లను ఉత్పత్తి చేసేందుకు తైవాన్ కు చెందిన క్రియేటివ్ సెన్సార్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు సహకరించాలని కోరింది. ఓర్వకల్లు సమీపంలోనే ఇ-జౌల్ ఇండియా జాయింట్ వెంచర్ సంస్థ అడ్వాన్స్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చింది. 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, కాథోడ్ యాక్టివ్ మెటిరియల్ తయారీ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ ప్రతిపాదించింది. వీటికి సంబంధించి సీఎం చంద్రబాబు సమక్షంలో తైవాన్ కంపెనీల ప్రతినిధులు- ఈడీబీ ఒప్పందాలు చేసుకున్నారు. తైవాన్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కుకు భూములు కేటాయిస్తామని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక పార్కులకు వివిధ రహదారులను అనుసంధానిస్తామని పేర్కొన్నారు. కర్ణాటక,ఏపీ, తమిళనాడు రీజియన్లను కలుపుతూ ఈ రహదారి మార్గాలు ఉన్నాయని తైవాన్ ప్రతినిధుల కు వివరించారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ పాలసీలో భాగంగా ప్రోత్సాహకాలకు సంబంధించిన నిర్ణయాలు త్వరలోనే కేంద్రం విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. తైవాన్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని తయారు చేసేందుకు సిద్ధమని సీఎం వెల్లడించారు. తైవాన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కూడా ఏపీలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఏపీలో పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ సహకారం బాగుందని తైవాన్ బృందం కొనియాడింది.

# రాష్ట్రానికి పెట్టుబడుల వరద



- రెన్యూ పవర్ ఛైర్మన్ సుమంత్ సిన్హాతో సీఎం చంద్రబాబు భేటీ
- రూ.82,000 కోట్లతో రాష్ట్రంలో 'రెన్యూ పవర్' ప్రాజెక్టులు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమక్షంలో కుదిరిన ఒప్పందాలు

విశాఖపట్నం (చైతన్య రథం): గత ప్రభుత్వంలో రాష్ట్రంనుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు భారీ పెట్టుబడులతో తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయి. విశాఖలో 14, 15 తేదీల్లో జరిగే 30వ సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ సమావేశాలకు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. పునరుత్పాదక విద్యుత్ రంగంలో దేశంలోనే ప్రముఖ సంస్థ రెన్యూ పవర్ రాష్ట్రంలో రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెన్యూ పవర్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం రెన్యూ పవర్ ఛైర్మన్, సీఈవో సుమంత్ సిన్హాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ ముందంజలో ఉందని, పర్యావరణ పరిరక్షణతో పాటు... వినియోగదారులకు విద్యుత్‌ను తక్కువ ధరకు అందించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల విషయంలో అత్యుత్తమ విధానాలు అనుసరిస్తోందని, వేగవంతమైన అనుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా సుమంత్ సిన్హా కొనియాడారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖకు వస్తున్న నేపథ్యంలో భారీగా తలెత్తే విద్యుత్ డిమాండ్ తీర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సుమంత్ వెల్లడించారు.

### ముందే ప్రకటించిన మంత్రి లోకేష్

మంత్రి లోకేష్ బుధవారం ఎక్స్‌లో ప్రకటించినట్లుగానే ఇంధన రంగంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన రెన్యూ పవర్ సంస్థ తిరిగి కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలు కుదుర్చుకుంది. గతంలోనే రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన రెన్యూ పవర్... మొత్తంగా రూ.82,000 కోట్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనుంది. ఒప్పందంలో భాగంగా 6 గిగావాట్ల ఇంగాట్-వేఫర్ ప్లాంట్, 2 గిగావాట్ల పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం, 5 గిగావాట్ల విండ్-సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ హైబ్రిడ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. తాజా ఎంఓయూల ద్వారా 10 వేలకు పైగా ఉద్యోగాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్రంలోని యువతకు దక్కనున్నాయి. రెన్యూ పవర్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో భారతదేశం లోనే అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు ల్లో ఒకటైన 2.8 గిగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో 1.8 గిగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్ ఉంది. అలాగే 2 గిగా వాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటుచేస్తుంది.

### రైతులతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు యోచన

మరోవైపు రాష్ట్రంలో వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, బీడు భూముల్లో రైతులు స్వయంగా సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఎంతమేర లాభదాయకంగా ఉంటుంది..., ఎకరానికి ఎంత ఆదాయం వస్తుందనే దానిపైనా రెన్యూ పవర్ ఛైర్మన్ సుమంత్ సిన్హాతో ముఖ్యమంత్రి చర్చించారు. అలాగే సోలార్ ప్యానెల్స్ ధరలు అధికంగా ఉన్నందున వాటి తయారీ యూనిట్లు రాష్ట్రంలో పెద్దఎత్తున నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.



# గ్లోబల్ చూపు.. ఏపీవైపు!

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్సే మన సక్సెస్
- పారదర్శక పాలనతోనే గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ పెట్టుబడులు
- అన్నిరంగాల్లో ఏపీని నెం.1గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- మరికొన్ని ఐటి జెయింట్స్ త్వరలో విశాఖపట్నానికి రాక
- నెలాఖరుకే గూగుల్ ఏఐ హబ్‌కు శంకుస్థాపన చేస్తాం
- ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను తీర్చిదిద్దుతాం
- 30వేల ఉద్యోగాలు కల్పించే 5 సంస్థలకు మంత్రి లోకేష్ భూమిపూజ



విశాఖపట్నం (చైతన్య రథం): కేవలం ఈజ్ ఆఫ్ డూయింగ్ మాత్రమేగాక, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తుండటం వల్లే గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయి. ఈ నమ్మకంతోనే ప్రపంచంలో ప్రముఖ సంస్థలను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించ గలిగిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. విశాఖలో సుమారు 30వేల ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించే 5 సంస్థలకు మంత్రి లోకేష్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యండాడలో ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ... గూగుల్ తమ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించడం, ఆర్సెలర్ మిట్టల్ రూ. 1.35లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడం కూటమి పాలన పారదర్శకత, విశ్వాసానికి అద్దం పడుతోందన్నారు. “గూగుల్ ప్రతినిధులు తొలిసారి విశాఖకు వచ్చాక వారితో వరుస చర్చలు జరిపి 13నెలల్లో రాష్ట్రానికి రప్పించాం. ఈ నెలాఖరుకు గూగుల్ ఏఐ హబ్‌కు శంకుస్థాపన చేస్తాం. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను కేవలం జూమ్ కాల్‌తో రాష్ట్రానికి రప్పించాం. వారితో చర్చలు జరిపినపుడు 3 సమస్యలు చెప్పారు. ఎన్ఎండిసి నుంచి స్లరీ పైప్‌లైన్ కోరగా, ముఖ్యమంత్రి వెంటనే ప్రధానితో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించారు” అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### విశాఖకు మరికొన్ని ఐటి జెయింట్స్ రాబోతున్నాయి

“టిసిఎస్, కాగ్నిజెంట్ త్వరలో విశాఖకు వస్తున్నాయి. మరికొందరు ఐటి జెయింట్స్ రాష్ట్రానికి రాబోతున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణకు మేం కట్టుబడి ఉన్నాం. క్లస్టరైజేషన్ ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నాం. కర్నూలు, అనంతపురంలో రెన్యువబుల్ ఎనర్జీ, కడప,చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ప్రకాశంలో సిబిజి, కృష్ణా, గుంటూరులో రాజధానిని అభివృద్ధి చేస్తున్నాం. ఆసియాలోనే తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ త్వరలో అమరావతికి రాబోతోంది. గోదావరి జిల్లాల్లో ఆక్వా పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నాం. ఉత్తరాంధ్ర ఫార్మా హబ్, కెమికల్ హబ్, డేటా సిటీ, స్టీల్ సిటీగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 20 క్లస్టర్ల ద్వారా వర్టికల్, హారిజంటల్ విధానంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం” అని స్పష్టం చేశారు.

### మా మనసులో ఎల్లప్పుడూ విశాఖకు స్థానం

“విశాఖపట్నం మా మనసుకు మా మనసుకు దగ్గరగానే ఉంటుంది. 2019లో రాష్ట్రవ్యాప్తంగా మాకు ఎదురుగాలి వీచినా విశాఖ ప్రజలు మాకు అండగా నిలిచారు. గతఎన్నికల్లో నాకు 91వేలమెజారిటీ వచ్చినా సంతృప్తి లేదు. పల్లా శ్రీనివాసరావు మొదటిస్థానం, గంటా శ్రీనివాసరావు రెండోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలో విశాఖ ఎంపి భరత్ అత్యధిక మెజారిటీతో గెలిచారు. విశాపట్నం భవిష్యత్తు నగరంగా అభివృద్ధి చెందబోతోంది. విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుత ఎమ్మెల్యేలలో 50శాతం మంది తొలిసారి గెలిచినవారు. మంత్రివర్గంలో 75శాతం మంత్రులు కొత్తవారు. అన్నిరంగాల్లో ఏపీని నెం.1గా చేయాలనే లక్ష్యంతో మేమంతా పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి మూడు కారణాలు ఉన్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, నిరూపితమైన నాయకత్వం (చంద్రబాబు గతంలో సైబరాబాద్ నిర్మించారు. ఇప్పుడు సైబరాబాద్‌కంటే బెటర్ సిటీని నిర్మించబోతున్నారు), డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఏపీలో ఉండటం. నరేంద్రమోడీ ఆలోచనలకు అనుగుణంగా సంస్కరణల అమలులో ఏపీ ముందువరసలో ఉంది. 3లక్షలమందితో యోగాంధ్ర నిర్వహించి మోడీజీతో అభినందనలు పొందాం. నేడు నమో అంటే నరేంద్రమోడీ కాదు... నాయుడు, మోడీ. భారత్‌కు ఇప్పుడు అత్యుత్తమ నాయకత్వం ఉంది. ఇండియా ప్రపంచంలో నెం.1 ఎకానమీగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు” అని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించారు.

### 2026 జూన్‌నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం

“విశాఖపట్నంలో ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. ఐటి పరిశ్రమలో ఎన్నోమార్పులు వచ్చాయి. రాబోయే మూడేళ్లలో ఐటి సెక్టార్ లో 5లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. 15లక్షల ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు పైప్ లైన్ లో ఉన్నాయి. ఫైళ్లను జెట్ స్పీడ్ తో క్లియర్ చేయడం మా ఐటి కార్యదర్శి కాటంనేని భాస్కర్ మెరుపువేగంతో పనిచేస్తున్నారు. 2026 జూన్ నాటకి భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తయి...అంతర్జాతీయ కనెక్టివిటీతో ప్రారంభం కాబోతోంది. ఉత్తరాంధ్ర పెట్టుబడులకు గేట్ వేగా మారబోతోంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 16నెలల్లో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం. ఇది గత పదేళ్లలో వచ్చిన పెట్టుబడుల కంటే అధికం. ఎపికి 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులే మా లక్ష్యం. ఈరోజు మన ప్రభుత్వ ప్రయాణంలో ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ మంత్రిగా అత్యంత మధురమైన క్షణాలు ఆస్వాదిస్తున్నాను. విశాఖపట్నంలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఎంతో గర్వంగా, సంతృప్తిగా ఉంది ఇవి ఆంధ్రప్రదేశ్ డిజిటల్, ఆర్థిక మార్పును సూచిస్తున్నాయి. ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న సైల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన, ఫీనోమ్ పీపుల్, కే రహేజా కార్ప్, వరల్డ్ ట్రేడ్ సెంటర్ (కపిల్ గ్రూప్) సంస్థల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ మీద ఉంచిన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ కలిపి రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నాయి. వీటిద్వారా విశాఖపట్నంలో 30వేలకు పైగా ప్రత్యక్ష ఉద్యోగాలను లభిస్తాయి. ఈ సంస్థల ద్వారా మన యువతకు కొత్త అవకాశాలను కల్పించడమేగాక, ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధిలో వేగం పుంజుకుంటుంది” అన్నారు.

### 20లక్షల ఉద్యోగాలు కేవలం సంఖ్య కాదు

“మన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ఇది కేవలం సంఖ్య కాదు, మనం పూర్తిగా అంకితభావంతో, వేగంగా కొనసాగిస్తున్న లక్ష్యం. అందుకే నేను పరిశ్రమదారులకు ఒక మాట చెప్పాను. మీరు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న తర్వాత, అది మీ ప్రాజెక్ట్ కాదు, మన ప్రాజెక్ట్ అని. ప్రపంచ ప్రఖ్యాత ఐటి, ఎలక్ట్రానిక్స్, ఇన్నోవేషన్ పెట్టుబడుల కోసం ఆంధ్రప్రదేశ్ ను అత్యంత అనువైన ప్రాంతంగా తయారు చేయడానికి మేము అహర్నిశలు శ్రమిస్తున్నాం. ఈరోజు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా మార్చింది మన భాగస్వామ్య సంస్థల తత్వం. iSpace Software Solutions, Tech Tammina సంస్థలకు కొద్దరోజుల క్రితం భూమి కేటాయించాం. వారు మనపై విశ్వాసంతో, ధైర్యంగా తమ శంకుస్థాపనకు ముందుకొచ్చారు. ఇది పరిశ్రమదారులు మన పాలనపై ఉంచిన నమ్మకాన్ని, ఆంధ్రప్రదేశ్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సూచిస్తుంది” అని స్పష్టం చేశారు.

### మేం భవిష్యత్తు నగరాన్ని నిర్మిస్తున్నాం

“ప్రస్తుతం మనది సరికొత్త ఆంధ్రప్రదేశ్. చురుకైన, ఆద్భుతమైన వేగంతో ముందుకెళ్తున్న రాష్ట్రం. విశాఖపట్నాన్ని ఏఐ క్యాపిటల్, డేటా సెంటర్ క్యాపిటల్, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం. మేము కేవలం టెక్నాలజీ పార్కులు, ఆఫీస్ స్పేస్ నిర్మించడమే కాదు, భవిష్యత్తు నగరాన్ని నిర్మిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దూరదృష్టి, క్రమశిక్షణ, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిపై ఆయనకున్న పట్టు మనందరికి ప్రేరణగా నిలుస్తున్నాయి. రేపు, ఎల్లుండి విశాఖపట్నంలో 30వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ జరగబోతోంది.

ఇది ప్రపంచవ్యాప్తంగా వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, ఇన్నోవేటర్లు పాల్గొనే అంతర్జాతీయ వేదిక. మేం ఈరోజు చేసింది కేవలం సాధారణ శంకుస్థాపనలు కాదు, ఆంధ్రప్రదేశ్ యొక్క డిజిటల్, ఏఐ భవిష్యత్తుకి అంకురార్పణ. మాపై నమ్మకంతో వచ్చిన ప్రతి కంపెనీకి ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌పై విశ్వాసంతో ఈ చారిత్రాత్మక మార్పులో భాగస్వాములు అవుతున్న ప్రతిఒక్కరికీ పేరుపేరునా అభినందనలు. మనం కలిసికట్టుగా అవకాశాలు, ఆవిష్కరణలు, లక్షలాది యువతకి నమ్మకాన్ని కల్పిస్తున్నాం. ఇది ఆంధ్రప్రదేశ్ దూరదృష్టికి నిదర్శనం. ఇది ఇంతటితో ఆగకుండా దినదిన ప్రవర్థమానమై మరింత ముందుకు సాగాలి. మనందరం కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వేగవంతమైన, విజ్ఞానవంతమైన, బలమైన శక్తిగా తయారు చేద్దాం” అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి ఎం శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, లోకం మాధవి, ఐటి కార్యదర్శి కాటంనేని భాస్కర్, సిఐఐ ఏపీ చైర్మన్ మురళీకృష్ణ, ఏపీ ఐటి అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు శ్రీధర్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



### అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

భోగాపురం (చైతన్య రథం): సీనియర్ నాయకులు, అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు లక్ష్మీ రమ్య, అనంత్ బాబులను ఆశీర్వరించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అంచింది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



# 4 గిగావాట్ల విద్యుదుత్పత్తి!

- రూ.15వేల కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన హీరో ఫ్యూచర్ ఎనర్జీస్
- సీఎం సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం
- అనకాపల్లి జిల్లాలో టాయ్‌పార్క్ ఏర్పాటు చేయనున్న పాల్స్ ప్లష్ సంస్థ
- రామాయపట్నం పోర్టువద్ద ఫర్నిచర్ క్లస్టర్ సిటీకి ఆసక్తి చూపిన స్వీడన్ సంస్థ



విశాఖపట్నం (చైతన్య రథం): 4 గిగావాట్ల పునరుద్పాతక విద్యుత్‌రంగంలో పెట్టుబడులకు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రూ.15 వేల కోట్ల వ్యయంతో అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో ఈ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ సీఎండీ రాహుల్ ముంజాల్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. సీఎం సమక్షంలో ఈ పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ -ఈడీబీ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సీఎండీకి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీ, హైబ్రీడ్ సొల్యూషన్స్ రంగాల్లోనూ పెట్టుబడులతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. డెడికేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ పార్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మరోవైపు రామాయపట్నం వద్ద అత్యాధునిక ఫర్నిచర్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు స్వీడన్ కు చెందిన జూల్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఆ సంస్థ ఫౌండర్ సీఈఓ టామ్ ఓలాండర్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. రూ.300 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనున్నామని జూల్ సంస్థ తెలిపింది. నార్వే, స్వీడన్ల నుంచి భారీ దుంగలను దిగుమతి చేసుకుని డోర్లు, విండోలు లాంటి ఉత్పత్తులతో పాటు ప్రీ ఫాబ్రికేషన్ విధానంలో ఇళ్లను కూడా రూపొందిస్తామని జూల్ సీఈఓ టామ్ ఓలాండర్ సీఎం చంద్రబాబుకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రామాయపట్నం పోర్టు సమీపంలో 500 ఎకరాల్లో ఫర్నిచర్ క్లస్టర్ సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

అమరావతి నగరంతో పాటు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని సీఎం వెల్లడించారు. అనంతరం ప్రముఖ ఆటబొమ్మల తయారీ సంస్థ పాల్స్ ప్లష్ టాయ్స్ సంస్థ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రిని కలిసి అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద టాయ్ పార్క్ ఏర్పాటుపై చర్చించారు. చైనా తరహాలో ఆట బొమ్మల తయారీకి సంబంధించిన ఎకోసిస్టంను తయారు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం బొమ్మల తయారీలో స్థానికంగా ఉన్న మహిళలకు ఉపాధి కల్పించాలని సీఎం ఆ సంస్థ ప్రతినిధుల్ని కోరారు.

# తూర్పుతీరంలో ఐటీ మేళా!

- ఒకేరోజు 5 కంపెనీలకు లోకేష్ భూమిపూజ
- పారిశ్రామికవేత్తలు, ప్రజల్లో ఆనందోత్సాహాలు

విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖపట్నంలో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ఒకరోజుముందే ఐటీ పండుగొచ్చింది. సమ్మిట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేష్ గురువారం ఒకేరోజు 5 కంపెనీలకు భూమిపూజ చేశారు. పారిశ్రామికవేత్తలతోపాటు విశాఖప్రజలు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.3,800 కోట్లతో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 30వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. కంపెనీల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేష్‌కు నగర ప్రజలు నీరాజనాలు పట్టారు. భారత్‌లో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖ గూగుల్ ఏఐ హబ్ ప్రకటన తర్వాత నగరానికి ఐటీ కంపెనీలు క్యూగట్టాయి. ఇప్పటికే టిసిఎస్, కాగ్నిజెంట్‌వంటి సంస్థలు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోగా, తాజాగా సైల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్, టెక్ తమ్మిన, ఫీనోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కె.రహేజా, కపిల్ గ్రూప్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ చేశారు. కారక్రమానికి హాజరైన ఎంపీ ఎం శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, లోకం మాధవి, ఏపీఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సెయిల్స్ సాఫ్ట్‌వేర్‌కు శంకుస్థాపన




విశాఖ మధురవాడ ఐటి హిల్ నెం.2లో సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ అడ్వాన్స్ సాఫ్ట్‌వేర్ ఇన్నొవేషన్ అండ్ ఏఐ ఎక్సలెన్స్ సెంటర్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. మంత్రితోపాటు కార్యక్రమానికి హాజరైన సంస్థ ఎండి, సీఈఓ కిరణ్ మాట్లాడుతూ... విశాఖలో రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా 430మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్‌పై దృష్టిసారించనున్నట్టు చెప్పారు.

## ఐస్పేస్ సాఫ్ట్‌వేర్‌కు భూమిపూజ

విశాఖ మధురవాడ ఐటీ హిల్ నెం.2లో ఐ-స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ యూనిట్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రితోపాటు హాజరైన సంస్థ సీఈవో రమేష్ మాట్లాడుతూ... విశాఖలో తమ సంస్థ మూడు దశల్లో రూ.119.18



కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా 2వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటిఓ సేవల డెలివరీ కార్యకలాపాలను తాము విశాఖ యూనిట్ ద్వారా చేపడతామన్నారు.

## ఫీనోమ్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమిపూజ




విశాఖ మధురవాడ ఐటి హిల్ నెం.2లో ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంస్థ కో ఫౌండర్ హరి బైర్రెడ్డి మాట్లాడుతూ... విశాఖ యూనిట్‌పై రెండుదశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్టు చెప్పారు. తాము అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఏఐ రీసెర్చి, కస్టమర్ డెలివరీ ఎక్సలెన్స్‌పై దృష్టిసారిస్తామన్నారు.

## రహేజా మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ స్పేస్‌కు శంకుస్థాపన



విశాఖ మధురవాడ ఐటి హిల్ నెం.3లో రహేజా సంస్థ ఐటి స్పేస్/కమర్షియల్ స్పేస్ మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ స్పేస్‌కు మంత్రి నారా లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ రవి సి రహేజా మాట్లాడుతూ... విశాఖలో రూ.2,172 కోట్ల పెట్టుబడి పెట్టడంద్వారా 15వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్టు చెప్పారు. ఐటీ కంపెనీలు, డాటా సెంటర్లు, జీసీసీ కంపెనీలకు అవసరమైన ఐటి స్పేస్, రెసిడెన్షియల్ లగ్జరీ ఫ్లాట్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు వెల్లడించారు.

## వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు భూమిపూజ




విశాఖ యండాడలో కపిల్ గ్రూప్ అనుబంధ సంస్థ బివిఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ఆధ్వర్యాన వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మాణానికి మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కపిల్ గ్రూప్ చైర్మన్ వామనరావు మాట్లాడుతూ... విశాఖలో రెండు విడతలుగా రూ.1250 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా 15వేలమందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఐటీ ఆఫీసు స్పేస్, కమర్షియల్ స్పేస్ మిక్స్‌డ్ డెవలప్‌మెంట్‌తోపాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పెట్టుబడుల ఆకర్షణ, హైవ్యాల్యూ జాబ్ క్రియేషన్ లక్ష్యాలుగా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.



చైతన్యరథం

# పోటెత్తిన పెట్టుబడులు!

- భాగస్వామ్య సదస్సుకు ముందే భారీగా ఎంఓయూలు
- ఒక్క రోజులోనే 5 రంగాల్లో 35 ఎంఓయూలు
- రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.26 లక్షలమందికి ఉద్యోగాలు
- ఇంధన శాఖలోనే రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన సంస్థలు
- ఏపీని విడిచి వెళ్లిన కంపెనీలను తిరిగి తెచ్చిన కూటమి ప్రభుత్వం
- పారిశ్రామికరంగానికి ఏపీ ఇస్తున్న సహకారానికి కంపెనీలనుంచి కితాబులు
- ప్రభుత్వం చేపట్టే అన్న క్యాంటీన్లకు భారీగా విరాళాలు
- వేగమే వేదంగా పెట్టుబడుల సాధనకు కృషి: ముఖ్యమంత్రి
- రోజంతా 15కు పైగా సమావేశాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు




విశాఖపట్నం (చైతన్య రథం): పెట్టుబడులు ఆకర్షించడంలో రాష్ట్రాన్ని నెంబర్ 1 స్థానంలో నిలపడమే ధ్యేయంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈమేరకు వేగమే వేదంగా పెట్టుబడుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. విశాఖపట్నంలో పెట్టుబడుల సదస్సుకు ముందురోజు గురువారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సుమారు 15కు పైగా సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన వారితో వరుస భేటీలు నిర్వహించారు. అలాగే తైవాన్, ఇటలీవంటి దేశాల రాయబారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులకున్న అవకాశాలను వివరించారు. ఏయే ప్రాంతంలో ఏయే రంగానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నామో వివరించడంతోపాటు... ఆయా ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఏవిధంగా ఉంది? అక్కడ కనెక్టివిటీ ఏవిధంగా అభివృద్ధి చేశామనే విషయాలను వివిధ పారిశ్రామికవేత్తలకు సీఎం సవివరంగా వివరించారు. అలాగే తైవాన్, ఇటలీ దేశాలకు చెందిన పరిశ్రమలను ఏపీలో పెట్టుబడులు పెట్టేలా చూడాలని ఆ దేశాల రాయబారులను ముఖ్యమంత్రి కోరారు. ఇక వివిధరంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ముందుకు రావడంతో పాటు... ప్రతిపాదనలతో వచ్చిన కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఈమేరకు రాష్ట్రానికి భారీఎత్తున పెట్టుబడులు పెట్టేలా వివిధ కంపెనీలు ముందుకొచ్చాయి. మొత్తంగా 35 ఎంఓయూలను ఒక్క రోజులోనే ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఈ ఎంఓయూలు ద్వారా భారీ పెట్టుబడులు రానున్నాయి. భాగస్వామ్య సదస్సు ప్రారంభానికి ముందురోజే ఏకంగా రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.26 లక్షలమందికి ఉద్యోగాలు కల్పించేందుకు కంపెనీలు ముందుకొచ్చాయి. ఇలా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన కంపెనీల్లో రెన్యూ పవర్‌వంటి ప్రముఖ సంస్థలు గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంనుంచి వెళ్లిపోయాయి. అప్పటి విధానాలు నచ్చక రాష్ట్రం విడిచి వెళ్లిన సంస్థలను తిరిగి ఏపీకి రప్పించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. రెండు రోజులపాటు జరిగే భాగస్వామ్య సదస్సులో సుమారుగా రూ.10 లక్షల కోట్లమేర పెట్టుబడులు వస్తాయనే అంచనాలున్నాయి. అయితే ఆ సదస్సు కంటే ముందే రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లకు రూ. కోటి విరాళం చెక్కును బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేర్ సంస్థ ముఖ్యమంత్రికి అందించింది.

## వనరులున్నాయి... కనెక్టివిటీ ఉంది...

భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వరుస సమావేశాలు నిర్వహించారు. అలాగే ఎంఓయూలు కుదుర్చుకునేందుకు నిర్వహించిన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."సీఐఐ సదస్సుకు ముందుగానే ఈస్థాయిలో పెట్టుబడులు రావడం చాలా సంతోషకరం. పెట్టుబడులకు ముందుకొచ్చిన పారిశ్రామికవేత్తలకు ధన్యవాదాలు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఏపీలో పరిశ్రమలు స్థాపించడానికి వివిధ సంస్థలు ముందుకొస్తున్నాయి. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్‌వంటి భారీ పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆ వేగంలో మనం ముందుడాలి. పెట్టుబడులు సాధించాలి. రాష్ట్రాన్ని పెట్టుబడుల్లో ముందుంచాలనేది ప్రభుత్వ ప్రయత్నం. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రంలో అనేక అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం రూపొందించిన ఎనర్జీ పాలసీ మంచి ఫలితాలనిస్తోంది. అందుకే ఇంధన రంగంలో భారీఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఏపీకి 1000 కి.మీ మేర సముద్ర తీరం ఉంది. పోర్టులు, రోడ్లు, రైలుమార్గం వంటి వాటిద్వారా లాజిస్టిక్స్ రంగానికి ఏపీ కేంద్ర బిందువుగా మారుతుంది. రాష్ట్రంలో అన్ని రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఉంది... దీన్ని వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలను కోరుతున్నా. హార్టికల్చర్, అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అవకాశాలు ఉన్నాయి. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీవంటి వాటిని ఏర్పాటు చేసుకుంటున్నాం. రాష్ట్రంలో పెద్దఎత్తున మినరల్ వెల్త్ ఉంది. వీటి విలువను మరింత పెంచగలిగే పరిశ్రమలు తెస్తున్నాం. ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త అనే నినాదంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ఆలోచనలతో వచ్చేవారికి అవకాశాలు కల్పిస్తాం. ఒప్పందం చేసుకున్న ప్రతి సంస్థకు భూములు కేటాయిస్తున్నాం. పారిశ్రామికవేత్తలు వేగంగా పనులు గ్రౌండ్ చేయడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో వెళ్తున్నాం. మా ప్రభుత్వం నుంచి అనుమతులు సహా ఏ విషయంలోనూ జాప్యం ఉండదు" అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## పెట్టుబడుల వెల్లువ... ఉద్యోగాల కల్పన...

శుక్రవారంనుంచి రెండు రోజులపాటు పెట్టుబడుల సదస్సు ప్రారంభమవుతుంటే... దానికంటే రోజుముందే వివిధ పరిశ్రమలు భారీఎత్తున పెట్టుబడులకు సిద్ధమయ్యాయి. రూ.3.65 లక్షల కోట్లమేర పెట్టుబడులపై ఎంఓయూలు కుదిరాయి. మొత్తంగా 5 రంగాల్లో ఈ పెట్టుబడులు రాగా... ఒక్క ఇంధన రంగం నుంచే రూ.2,64,787 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇంధన శాఖ 7 ఎంఓయూలు కుదుర్చుకుని పెట్టుబడులను రాబట్టింది. ఇంధన రంగంలో వచ్చిన పెట్టుబడుల ద్వారా 49,400 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇక మిగిలిన నాలుగురంగాల్లో పెట్టుబడులు వచ్చిన విధానం పరిశీలిస్తే... 8 ఒప్పందాల ద్వారా ఏపీ సీఆర్డీఏకు రూ.32,300 కోట్లు, 7800 మందికి ఉద్యోగాలు రానున్నాయి. 4 ఎంఓయూల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రూ.2319 కోట్ల పెట్టుబడి, 8166 మందికి ఉద్యోగాలకు అవకాశం ఉంది. 3 ఒప్పందాల కుదుర్చుకుని ఐ అండ్ ఐ రంగంలో రూ.12,255 కోట్ల పెట్టుబడులు, 1300 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు వివిధ సంస్థలు ముందుకు వచ్చాయి. మరోవైపు 3 ఎంఓయూల ద్వారా రూ.52,143 కోట్ల పెట్టుబడుల ద్వారా 32,105 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చేలా పరిశ్రమలు-వాణిజ్యం రంగం ఆయా సంస్థల నుంచి హామీ పొందింది.

## కంపెనీల వివరాలివి...

రాష్ట్ర ప్రభుత్వంతో ఏయే కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి? ఎంత మేర పెట్టుబడులు పెట్టనున్నాయి? ఏమేరకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయనే వివరాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

## ఇంధన రంగం...

- ఏబీసీ క్లీన్ టెక్ అండ్ ఆక్సిస్ ఎనర్జీ వెంచర్స్ - రూ.1,10,250 కోట్లు. 13500 మందికి ఉద్యోగాలు
- రీన్యూ పవర్- రూ.25000 కోట్లు. 10000 మందికి ఉద్యోగాలు
- రీన్యూ ఇ-ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్- రూ.17000 కోట్లు. 1100మందికి ఉద్యోగాలు.
- రీన్యూ ప్రైవేట్ లిమిటెడ్- రూ.12500 కోట్లు. 3250మందికి ఉద్యోగాలు
- నవయుగ ఇంజనీరింగ్- రూ.23427 కోట్లు. 6300మందికి ఉద్యోగాలు
- చింతా గ్రీన్ ఎనర్జీ- రూ.27955 కోట్లు. 6600మందికి ఉద్యోగాలు
- ఫోర్ స్క్వేర్ గ్రీన్ ఎనర్జీ- రూ.10205 కోట్లు. 1750మందికి ఉద్యోగాలు
- ఇండోసోల్- రూ.23450 కోట్లు. 6900మందికి ఉద్యోగాలు
- షిర్డీ సాయి- రూ.15000 కోట్లు. 15400మందికి ఉద్యోగాలు

## పరిశ్రమలు- వాణిజ్య రంగం:

- రెన్యూ ఫొటో వాల్ టైక్స్- రూ.5451 కోట్లు, 3600మందికి ఉద్యోగాలు
- ఇండోసోల్- రూ.2200 కోట్లు. 500మందికి ఉద్యోగాలు
- షిర్డీ సాయి- రూ.5000 కోట్లు. 5000మందికి ఉద్యోగాలు
- వైజాగ్ ప్రొఫైల్స్ లాజిస్టిక్స్- రూ.6000 కోట్లు. 5250మందికి ఉద్యోగాలు
- స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా- రూ.4650 కోట్లు. 5400మందికి ఉద్యోగాలు
- విరూపాక్ష ఆర్గానిక్స్- రూ.1189 కోట్లు. 2000మందికి ఉద్యోగాలు
- అనంత్ టెక్నాలజీస్- రూ.1000 కోట్లు. 1000మందికి ఉద్యోగాలు
- ఏటీఆర్ వేర్ హౌసింగ్- రూ.1100 కోట్లు. 6200మందికి ఉద్యోగాలు
- లారస్ ల్యాబ్స్- రూ.1000 కోట్లు. 500మందికి ఉద్యోగాలు
- మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్- రూ.1000 కోట్లు. 1800మందికి ఉద్యోగాలు
- ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్- రూ.1000 కోట్లు. 500మందికి ఉద్యోగాలు
- మల్లాది ఫార్మా- రూ.353 కోట్లు. 355మందికి ఉద్యోగాలు
- ఈజౌల్- రూ.19000 కోట్లు. 1800మందికి ఉద్యోగాలు
- కోరమండల్- రూ.2000 కోట్లు. 500మందికి ఉద్యోగాలు
- తైవాన్ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్- రూ.1200 కోట్లు. 10000మందికి ఉద్యోగాలు
- జూల్- రూ.1500 కోట్లు. 1000మందికి ఉద్యోగాలు

## ఏపీ సీఆర్డీఏ:

- మణిపాల్ గ్రూప్- రూ.15000 కోట్లు. 1000మందికి ఉద్యోగాలు
- బెర్జాయ గ్రూప్- రూ.8300 కోట్లు
- అమరావతి లైఫ్ సైన్సెస్- రూ.2000 కోట్లు
- మైసిటీ- రూ.2000 కోట్లు
- వివెన్స్ గ్రూప్- రూ.2000 కోట్లు. 5000మందికి ఉద్యోగాలు
- ఫ్యాషన్ ఎంటర్ ప్రెన్యూర్ ఫండ్- రూ.1200 కోట్లు. 1200మందికి ఉద్యోగాలు
- ఏస్ అర్బన్ డెవలపర్స్- రూ.1800 కోట్లు. 600మందికి ఉద్యోగాలు

## ఐ అండ్ ఐ:

- క్రౌన్ ఎల్ఎన్జీ- రూ.10640 కోట్లు.
- ఆర్సీఆర్టీ- రూ.1615 కోట్లు. 1300మందికి ఉద్యోగాలు

## ఫుడ్ ప్రాసెసింగ్:

- ఉమెన్ ఓవా అగ్రో ఫుడ్ పార్క్- రూ.1440 కోట్లు. 7000మందికి ఉద్యోగాలు
- ఐటీసీ ఫుడ్స్- రూ.400 కోట్లు. 500మందికి ఉద్యోగాలు
- గాద్రేజ్ అగ్రో వెట్- రూ.279 కోట్లు. 66మందికి ఉద్యోగాలు
- బిస్లరీ- రూ.200 కోట్లు. 500మందికి ఉద్యోగాలు

## 30వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్- 2025

# విశ్వ వేదికగా విశాఖ

- ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సీఐఐ సమ్మిట్
- ప్రధాన వేదికగా పెవిలియన్ ప్లీనరీహాలు
- ముఖ్య అతిథిగా భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- గౌరవ అతిథులుగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబు
- వివిధ అంశాలకు వివిధ అనుబంధ వేదికలు, వివిధ ప్లీనరీ సెషన్లు
- రెండు రోజుల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో 40 వరకు సెషన్లు
- 450 నుండి ఐదు వందల పెట్టుబడి ఒప్పందాలు
- పదిలక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగాలు అంచనా
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ
- రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పలువురు మంత్రులు






విశాఖపట్నం, (చైతన్యరథం): విశాఖపట్నంలో నేడూ, రేపూ రెండు రోజులపాటు జరుగనున్న 30వ సీఐఐ(భారత పరిశ్రమల సమాఖ్యభాగస్వామ్య సదస్సు నిర్వహణకు విస్తృతంగా చేపట్టిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారతప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ భాగస్వామ్యంతో సాగరతీర నగరం, విశాఖపట్నం ఆంధ్ర విశ్వకళా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సీఐఐ సమ్మిట్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ ప్లీనరీహాల్ ప్రధాన వేదికగా, దానికి అనుబంధంగా వివిధ హాళ్ళను సిద్ధం చేశారు. అక్కడ వివిధ ప్లీనరీ సెషన్లు జరగనున్నాయి.

రెండు రోజుల సీఐఐ సమ్మిట్లో భాగంగా తొలిరోజు శుక్రవారం ఉ.8.30 గం.ల నుండి ఈ.10.30 గం.ల వరకు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ ప్లీనరీహాల్ 5లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాష్ట్ర గవర్నర్ జస్టీస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా పాల్గొంటారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామాత్యులు పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు కీలకోపాన్యాసం చేస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పలువురు పరిశ్రమల ప్రతినిధులు,రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొంటారు. అనంతరం 10.30 గంటల నుండి 11.45 గంటల వరకు ప్లినరీ ప్రారంభ కార్యక్రమం జరుగుతుంది. గౌరవ అతిథులుగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. పలువురు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారు.అదే సమయంలో వివిధ కాన్ఫరెన్స్ హాళ్లలో వివిధ ప్లీనరీ సెషన్లు సా.8 గంటల వరకు జరుగుతాయి. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం వరకూ వివిధ ప్లీనరీ హాళ్లలో పలు ప్లీనరీ సెషన్లు జరుగుతాయి. అనంతరం సాయంత్రం 5 గం.ల నుండి 5.45 గంటల వరకు ఈ రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు వేడుక ప్రధాన వేదిక ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ ప్లీనరీహాల్ 5లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అతిథులుగా పాల్గొంటారు. అదే విధంగా సీఐఐ ఉపాధ్యక్షులు సుచిత్ర, సీఐఐ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్మన్ ఆర్ దినేష్ తదితరులు పాల్గొంటారు. అనంతరం సా.5.45 గం.లకు సదస్సు ముగుస్తుంది. రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున భారీ ఏర్పాట్లు చేసింది. ప్రధాన వేదిక ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో సభావేదికతో పాటు ముఖ్య అతిథులు, ఇతర అతిథులు, మీడియా ప్రతినిధులు తదితరులు కుదుర్చుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు. మిగతా ప్లినరీ హాల్స్ వద్ద కూడా తగిన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా సభావేదికకు వెలుపల ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో వివిధ వాహనాల పార్కింగ్‌కు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.




### సీఐఐ సమ్మిట్‌పై విస్తృత ప్రచారం

రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటి చెప్పే ప్రక్రియలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీ సహా ముంబాయి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లోని ప్రధాన కూడళ్ల, విమానాశ్రయాల్లో పలు హోర్డింగులు, డిజిటల్ డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్రంలోని ఇతర ముఖ్య నగరాలు, పట్టణాల్లో కూడా పెద్ద ఎత్తున హోర్డింగులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నగరమంతా సీఐఐ సదస్సుకు సంబంధించి పెద్ద ఎత్తున హోర్డింగులు ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునే రీతిలో ఏపీ బ్రాండింగ్ జరిగింది.వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా సీఐఐ సమ్మిట్‌పై విస్తృతమైన ప్రచారం జరిగింది.

### సమ్మిట్లో పెద్ద ఎత్తున అవగాహనా ఒప్పందాలు

విశాఖపట్నంలో జరుగుతున్నసీఐఐ సమ్మిట్లో వివిధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య పలు అవగాహనా ఒప్పందాలు జరుగుతాయి. ఇప్పటికే 13వ తేదీన పరిశ్రమల శాఖ 9 ఎంఓయులు, ఐఅండ్ఐ 3, ఆహారశుద్ధి శాఖ 4, ఇంధన శాఖ 6, సీఆర్డీఏ 8 ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. తొలిరోజు శుక్రవారం సదస్సులో సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30. గంటల మధ్య ప్రధాన వేదిక ప్రాంగణంలో హాల్ నంబరు 7లో పరిశ్రమల శాఖ 14, ఐఅండ్ ఐ 15,ఆహార శుద్ధి శాఖ 6,ఇంధన శాఖ 21 అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకోనుంది.అదే విధంగా చివరి రోజు శనివారం మధ్యాహ్నం 2.30.గంటల నుండి 3.30 గంటల మధ్య ప్రధాన వేదిక ప్రాంగణం హాల్ నంబరు 7లో పరిశ్రమల శాఖ 27 ఎంఓయులను,పర్యాటక శాఖ 21,ఐటి శాఖ 7,చేనేత జౌళి శాఖ రెండు అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకోనుంది. ఈ రెండు రోజుల్లోనూ మిగతా హాల్లో కూడా వివిధ సంస్థలతో పలుశాఖలు అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంటాయి.








# తూర్పుతీర మణిమకుటం విశాఖ

### సీఐఐ సమ్మిట్ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ



విశాఖపట్టణం, (చైతన్యరథం): తూర్పు తీరంలో విశాఖ ఓ మణిహారమని మునిసిపల్ శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. విశాఖ సీఐఐ సమ్మిట్ సందర్భంగా ఆయన కార్యక్రమ ప్రాంగణాలను సందర్శించారు. ఏర్పాట్లను సమీక్షించారు. సమ్మిట్ ఏర్పాట్లలోనే ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు సాక్షాత్కరిస్తోందని సన్నాహాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది సీఎం చంద్రబాబు దార్శకనిక యుక్తికి, మంత్రి లోకేశ్ యువశక్తికి, కూటమి ఐక్యతా కృషికి తార్కాణంగా నిలుస్తుందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో విశాఖను గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. స్వర్ణాంధ్ర 2047 మిషన్ లో భాగంగా సమీకృత, సుస్థిరాభివృద్ధితో కూడిన సుపరిపాలనను అందిస్తోందన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. 15 మాస్టర్ ప్లాన్ క్లస్టర్లు, పారిశ్రామిక నగర ప్రాంతాలను విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో తీర్చిద్దుతున్నామన్నారు. అర్బన్ మొబిలిటీని రీడిఫైన్ చేస్తున్నామన్నారు. 77 కిలోమీటర్ల మెట్రో రైల్ ,గ్రీన్, ఇంటెలిజెంట్ గవర్నెన్స్‌తో పురపాలన సాగేలా 4వేల ఈవీ బస్సులు, వాహనాలను వినియోగించి పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతామన్నారు. సుస్థిర పట్టణాభివృద్ధికి ఓ మోడల్‌గా విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను తీర్చిదిద్దుతామన్నారు. పౌరులకు ఆధునిక సాంకేతికతతో కూడిన సుపరిపాలన అందించేలా ప్రణాళికలు చేశామన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్డీఏలు ఇతర విభాగాలతో కలిసి ఈ ప్రాంతాన్ని అత్యంత క్రియాశీలకంగా తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ అభివృద్ధి ప్రయాణం ఇప్పటికే ప్రారంభమయిందన్నారు. గూగుల్ డేటా సెంటర్ , ఐటీ కేంద్రాలతో అభివృద్ధి మోడల్ గా ఈ ప్రాంతం తయారవుతోందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, వికసిత్ భారత్ లక్ష్యాలలో విశాఖ కీలకంగా మారనుందని మంత్రి నారాయణ చెప్పారు.

# ప్రకృతి ప్రేమికుల స్వర్గధామం విశాఖతీరం

### వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్





విశాఖపట్నం, (చైతన్యరథం): ప్రకృతి ప్రేమికులకు విశాఖనగరం ప్రసిద్ధ పర్యాటక గమ్యస్థానమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నేడు, రేపు విశాఖపట్నంలో జరుగనున్న పార్ట్‌నర్ షిప్ సమ్మిట్‌కు నగరానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా నగరంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. తొలుత విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ సమీపంలోని టీయూ 142 ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియంను సందర్శించారు. ఎయిర్ క్రాఫ్ట్ విశేషాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో విన్యాస ప్రదర్శనలు ఇచ్చి దాదాపు 30 సంవత్సరాలు యుద్ధరంగంలో ఎన్నో సేవలను అందించిన ఎయిర్ క్రాఫ్ట్‌ను సందర్శించడం ఆనందంగా ఉందని తెలిపారు.

త్రివిధ దళాలలో భాగమైన ఈ ఎయిర్ క్రాఫ్ట్‌ను భవిష్యత్ తరాలకు అందించాలన్న ఆలోచన గొప్పదని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. అనంతరం విశాఖపట్నం బీచ్ రోడ్డులోని ఇండియాలోనే ఫస్ట్‌లైట్ ఆర్ట్ థీమ్ పార్క్‌ను సందర్శించారు. వినోదాన్ని కోరుకునే వారికి వైజాగ్‌లో చాలా పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వెల్లడించారు.

నగర జీవితంలోని గందరగోళం, ఒత్తిడితో కూడిన దైనందిన జీవితంలో వత్తిడి నుండి విశ్రాంతి తీసుకోవాలనుకునే వారికి వైజాగ్‌లోని థీమ్ పార్క్‌లు మంచి ఉపశమనాన్ని ఇస్తున్నాయన్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా కుటుంబం స్నేహితులతో కలిసి ఆనందంగా ఉత్సాహ భరితమైన రోజును గడిపే ప్రదేశమని, తాను సందర్శించిన అమ్యూజ్ మెంట్ పార్క్ మాయా ప్రపంచమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

# తూర్పు తలుపు తోసుకొస్తున్న పారిశ్రామిక పెట్టుబడులు

**- విశాఖ తీరాన సీఐఐ సమ్మిట్ సన్నాహాలను సమీక్షించిన మంత్రి బీసీ జనార్ధనరెడ్డి**

విశాఖపట్నం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శకనికత అనన్యసామాన్యమని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సీఐఐ సమ్మిట్ సందర్భంగా విశాఖ చేరుకున్న ఆయన వాతావరణాన్ని చూసి తన్మయత్వంలో తేలియాడారు. చంద్రబాబు మదిలో కదలికలే విశాఖ కెరటాల మాదిరిగా పారిశ్రామిక పెట్టుబడుల హోరై వినిపిస్తున్నాయన్నారు. మిగిలిన కార్యక్రమాలను యువమంత్రి లోకేశ్ చక్కబెట్టి స్వర్ణాంధ్రను సువర్ణాక్షరాలతో లిఖిస్తారన్నారు. విశాఖలోని నోవాటెల్ హోటల్లో మారిటైం బోర్డుతో 3 కంపెనీలు ఒప్పందాలు సీఎం చంద్రబాబు సమక్షంలో చేసుకుంటామన్నారు. ఏపీ ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే సంస్థలతో ఒప్పందాలు కూడా జరుగుతాయన్నారు. సాయంత్రం 10 వ ప్లీనరీ సెషన్‌లో రాష్ట్రంలో కోస్తా తీర ప్రాంతంలో ఉన్న అవకాశాలపై ప్రసంగిస్తారు.

# గురుకులాల్లో ప్రమోషన్ల సందడి

**- సీనియర్ ప్రిన్సిపాళ్ళ నియామకం**
**- మంత్రి సవిత కృషితో ప్రమోషన్లకు లైన్ క్లియర్**
**- ఎంజేపీ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల హర్షం**



అమరావతి, (చైతన్యరథం): ఎంజేపీ గురుకులాల్లో ప్రమోషన్ల సందడి నెలకొంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత చొరవతో పదోన్నతులకు మార్గం సుగమమయింది. దీంతో 11 మంది జూనియర్ ప్రిన్సిపాళ్లకు సీనియర్ ప్రిన్సిపాళ్లగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో పదోన్నతుల కోసం జూనియర్ ప్రిన్సిపాళ్లు కొన్నేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పదోన్నతులపై వారి ఆశలు చిగురించాయి. ఇదే విషయమై మంత్రి సవిత దృష్టికి ఎంజేపీ గురుకులాల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చారు. ఇన్చార్జిలతో గురుకులాల నిర్వహణ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రికి వివరించారు. మంత్రి సవిత వెంటనే స్పందించి, గురుకుల పాఠశాలల్లో పదోన్నతుల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలు నేపథ్యంలో 11 మంది జూనియర్ ప్రిన్సిపాళ్లకు సీనియర్ ప్రిన్సిపాళ్లగా పదోన్నతులు కల్పిస్తూ ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న ప్రమోషన్లు రావడంతో జూనియర్ ప్రిన్సిపాళ్లు, ఎంజేపీ గురుకులాల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# పెట్టుబడుల పునరాగమనం!

విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు దార్శనిక దృష్టి, డైనమిక్ లీడర్ నారా లోకేశ్ కృషితో నవ్యాంధ్రలో పెట్టుబడుల ప్రవాహం పోటెత్తుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల్లోనే 150పైగా కంపెనీలు సుమారు రూ. 10లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. నాడు కాదు అనుకొని వెళ్లిన కంపెనీలు.. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న పాలసీలకు మంత్రముగ్ధులవుతున్నాయి. నేడు, రేపు జరగనున్న విశాఖ సీఐఐ సమ్మిట్‌లో మరో రూ. 9.8 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 412 ఒప్పందాలు జరగనున్నాయి. దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు విశాఖ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. గత ప్రభుత్వ హయంలో జగన్ విధ్వంస పాలనను చూసిన పెట్టుబడిదారులు.. రాష్ట్రంవైపు చూడాలంటేనే భయపడ్డారు. కొందరు ధైర్యంచేసి ముందుకు రాగా.. ఫ్యాక్షన్ రాజకీయాలకు వాళ్లుసైతం సామన్లు సర్దుకొని పక్క రాష్ట్రాలకు తరలిపోయారు.

**కూటమి ప్రభుత్వంలో పెట్టుబడుల వరద:**

2024వ సంవత్సరం జూన్ 4న రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తిరిగి ఏర్పడిన మొదటి నెలలోనే అశోక్ లే ల్యాండ్ కంపెనీ "మేము తిరిగి వస్తున్నాం" అని ప్రకటించారు. ఏసీఈ పెయింట్ "మన ఆంధ్ర-మన ఏసీఈ పెయింట్" నినాదంతో ముందుకు వచ్చారు. అలా మొదలైన ప్రవాహం లులూ, సుజలాన్, ఏషియన్, రిలయన్స్, ఎన్టీపీసీ, టాటాపవర్, వేదాంత, రెన్యూలాంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి, వస్తున్నాయి. గతవారం నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో ప్రారంభించిన హిందాల్కో కంపెనీతో ఐ ఫోన్ తయారీకి ప్రపంచంలో గేట్‌వేగా ఏపీ నిలవబోతుంది. నారా లోకేశ్ పెట్టుబడుల వేటలో సాధించిన అతిపెద్ద విజయం టెక్ దిగ్గజం గూగుల్‌ను విశాఖకు తీసుకురావడం. దేశంలోనే అతిపెద్ద ఎఫ్డీఐగా 15 బిలియన్ డాలర్లతో విశాఖ సాగర తీరాన ఏఐ సిటీని గూగుల్ నిర్మించనుంది. దీంతో పక్క రాష్ట్రాల దృష్టి ఏపీవైపు మళ్లింది. ఆయా అసెంబ్లీలో దీనిపై విస్తృతంగా చర్చలు కూడా జరిగాయి. తాజాగా రూ. 82,000 కోట్ల పెట్టుబడితో రెన్యూ సంస్థ పెట్టుబడులతో ముందుకు రావడం శుభపరిణామం. ఈ సంస్థ సోలార్ ఇంగోట్, వేఫర్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, హై టెక్నాలజీ రంగాలలో పెట్టుబడి పెట్టనుంది. అలాగే ప్రజారాజధాని అమరావతిలో రూ. 44వేల కోట్ల పైచిలుకు పెట్టుబడులు రానున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రూ. 51వేల కోట్లతో అమరావతి అభివృద్ధి పనులు జరుగుతుండగా... తాజాగా వచ్చిన పెట్టుబడులతో అమరావతి మరింత వెలుగొందనుంది. ఐదు కోట్ల ఆంధ్రుల కల మరికొద్ది రోజుల్లో నిజం కానుంది. ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల్లో ఇప్పటివరకు 150పైగా కంపెనీలు పోటీపడుతూ ఏపీలో అడుగుపెట్టాయి. నాడు జగన్ కమీషన్‌లకు భయపడి తరలిపోయిన కంపెనీలు.. నవ్యాంధ్ర అభివృద్ధిలో మేము సైతం అంటూ ముందుకొస్తున్నాయి. నాడు జగన్ విధ్వంసాలకు భయపడిన ప్రపంచ ప్రఖ్యాత లులూ మాల్ నేడు విశాఖ, విజయవాడలో మాల్స్ స్థాపనకు ముందుకు రాగా... వాటికి సంబంధించి ఇప్పటికే భూ కేటాయింపులు జరిగాయి. జగన్ రాజకీయ కక్షకు బలై అమర్‌రాజా, జాకీ పరిశ్రమవంటి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంతో వేలమంది ఉద్యోగులు రోడ్డునపడ్డారు. జగన్ అరాచక పాలనకు ప్రతీకగా ఆ ఐదేళ్లూ రాష్ట్రంలో నిరుద్యోగం 12శాతం పెరిగింది. ఇంజినీరింగ్‌లాంటి ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు చాలించాలని జీతాలకు పక్క రాష్ట్రాలకు వెళ్లి పని చేయాల్సిన దుస్థితి తలెత్తింది. నేడు పరిస్థితులు మారాయి. 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా యువనేత నారా లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఇప్పటికే 10 లక్షల ఉద్యోగాలు కల్పించే సంస్థలను రాష్ట్రనికి తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఒకటే రాజధాని -అభివృద్ధి వికేంద్రీకరణ సిద్ధాంతంతో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా పని చేస్తోంది. ఇటు ప్రజా సంక్షేమం సాగిస్తూనే.. పెట్టుబడులను సరైన రీతిలో సమర్థంగా విస్తరించడానికి కూటమి ప్రభుత్వం పాలసీలు రూపొందించింది. ఈ విధానాలు నచ్చిన పెట్టుబడిదారులు పరిశ్రమల విభాగాలు, ఉత్పత్తి, తయారీ, సాంకేతికరంగాలు, సేవారంగాలు, హెల్త్‌కేర్, వ్యవసాయ, పర్యాటకరంగం వంటి రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. సాంకేతిక రంగంలో, ఐటీ సంస్థలు, స్టార్ట్-అప్స్, డిజిటల్ సర్వీసులువంటి అనేక విభాగాల్లో పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖ సీఐఐ సమ్మిట్‌లో మరిన్ని కంపెనీలనుంచి పెట్టుబడుల వరద రాబోతుంది. ఏపీ చరిత్రలోనే చరిత్రక ఘట్టంగా 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలవనుంది.

**ఎన్ నీలం నాయుడు**
**(అనలిస్ట్, నాలెడ్జ్ సెంటర్)**

# ఏనుగుల సంచారంపై అలెర్ట్



**- ముందస్తు హెచ్చరికలు విస్తృతం చేయండి**
**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం**

అమరావతి (చైతన్య రథం): అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాల్లోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేసే ప్రక్రియను మరింత పెంచాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటన డిప్యూటీ సీఎం దృష్టికి వచ్చింది. పీసీసీఎఫ్, సంబంధిత అధికారులతో గురువారం ఉదయం ఘటనపై చర్చించారు. కిట్టయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. తమిళనాడు అటవీ ప్రాంతం వైపునుంచి వచ్చిన ఏనుగు మూలంగా ఘటన చోటు చేసుకొందని, అక్కడ కూడా ఏనుగు మూలంగా మరణాలు సంభవించాయని అటవీ శాఖ అధికారులు వివరించారు. మన రాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వస్తోందని ట్రాక్ చేసిన వెంటనే సమీప గ్రామాలవారికి ముందుగానే తెలియచేశామన్నారు. పవన్ కళ్యాణ్ స్పందిస్తూ 'ముందస్తు హెచ్చరికలను మరింత విస్తృతం చేయండి. గ్రామాలవారీగా, రైతులతోనూ, సోషల్ మీడియా గ్రూప్స్ ఏర్పాటుచేసి వాటికి సమాచారం అందించాలని, వాయిస్ మెసేజిలు పంపిస్తే సమాచారం తొందరగా చేరుతుందని అన్నారు.

## ఎంజేపీ విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణ

**- రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత వెల్లడి**



అమరావతి (చైతన్య రథం): ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులకు ఫస్ట్ ఇంటర్ నుంచి నీట్, ఐఐటీలో శిక్షణ ఇవ్వనున్నారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా శిక్షణ అందజేయనున్నట్టు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. దీనిలో భాగంగా ఎంజేపీ గురుకులాల్లో విద్యనభ్యసిస్తూ, పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నీట్, ఐఐటీకి ఉచిత శిక్షణ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విశాఖలోని సింహాచలం ఎంజేపీలో బాలురకు, శ్రీ సత్యసాయి జిల్లా టేకులోడు ఎంజేపీలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన బోధకులతో శిక్షణ అందజేస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఎంజేపీలో నీట్, ఐఐటీలో ఉచిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని మంత్రి సవిత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రంగా ఆంధ్ర

**- రాష్ట్ర సమాచార శాఖామంత్రి కొలుసు పార్ధసారధి**

విశాఖపట్నం, (చైతన్యరథం): ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఆకర్షణ కేంద్రంగా మారిందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్ధసారథి అన్నారు. రాష్ట్రం ప్రపంచాన్ని కదిలించే వైబ్రెంట్ స్టేట్‌గా విరాజిల్లుతోందని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ఏర్పాట్లను మంత్రి కొలుసు పార్ధసారథి గురువారం పరిశీలించారు. ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్రానికి సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముందూ తరువాత అనే రీతిలో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబుపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని పేర్కొన్నారు. వెళ్లి పోయిన పరిశ్రమలు సైతం వెనక్కి వస్తున్నాయని, నారా లోకేశ్ , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషితోతో రాష్ట్రంలో అభివృద్ధి వేగం పుంజుకుందన్నారు. సుమారు పది లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి వెల్లడించారు. సమావేశం జరగక ముందే కొత్త కంపెనీల భూమి పూజలు జరుగుతున్నాయని, గూగుల్, టీసీఎస్, లాంటి పెద్ద సంస్థలు విశాఖలో విస్తరిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలంలో రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ సదస్సులో కనీసం 450 నుండి ఐదు వందల పెట్టుబడి ఒప్పందాలు



జరగనున్నాయని చెప్పారు.తద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయని, పెట్టుబడులు లక్షల కోట్లలో రానున్నాయని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు జాతీయ అంతర్జాతీయ స్థాయి నుండి ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. రెండు రోజుల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో 40 వరకు సెషన్లు జరగనున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన ఇళ్లకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన ఇళ్లను కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. మరి కొద్ది నెలల్లో రెండో విడతగా మరిన్ని ఇళ్లకు గృహప్రవేశాలు చేయిస్తామని అన్నారు.

# జగన్.. ప్రమాదకర విషవృక్షం

- **కూకటి వేళ్లతో పెకిలించాల్సిన బాధ్యత ప్రజలదే**
- **ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని విధ్వంసానికి గురి చేశాడు**
- **అభివృద్ధికి బాటలేస్తున్న కూటమికి అడ్డుతగులుతున్నాడు**
- **జగన్‌ను నమ్మినవాళ్లంతా భయంతో బయటపడుతున్నారు**
- **ప్రమాదకర వైసీపీకి మళ్లీ బుద్ధిచెప్పాలి**
- **పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు పిలుపు**



మంగళగిరి (చైతన్య రథం): అత్యంత అవినీతిపరుడు, అరాచకవాది, నేర చరిత్ర కలిగిన మాఫియా లీడర్ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా రాష్ట్రాన్ని అన్నివిధాలా సర్వనాశనం చేశాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా అనంద్ బాబు మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... "వైసీపీ హయాంలో జగన్‌ను నమ్మి పని చేసినవాళ్లు నేడు భయపడిపోతున్నారు. జగన్‌రెడ్డి తన రాజకీయ అధికార దోపిడి దాహానికి ఎవరినైనా బలిస్తాడు. అందులో తర తమ భేదాలేమీ లేవు. రక్త సంబంధం లేదు, స్నేహితులు, బంధువులు లేదు. వైఎస్ఆర్ అధికారంలో ఉన్నప్పుడే లక్షల కోట్లు దోచేశాడు. 16 నెలలు జైల్లో ఉన్నాడు. చట్టాన్ని ఉల్లంఘించటం, అధికారులూ ఉల్లంఘించేలా చేయడం, మానసిక ఆనందం పొందటం జగన్ నైజం. జగన్ చేష్టలకు అరడజనుపైన ఐఏఎస్‌లు జైళ్లకెళ్లారు. ఇది యదార్థం. ఎంతోమంది పారిశ్రామికవేత్తలు జైళ్లకెళ్లారు. నేరమనస్తత్వం ఉన్న జగన్.. తన చుట్టూ ఉన్నవాళ్ళతోనూ నేరాలే చేయిస్తాడు. వాళ్లకి అలవాటు లేకపోయినా.. అలవాటుచేసి నేరాల్లో భాగస్వాములు చేసి బలిచేస్తాడు. గత ఐదేళ్లు జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లోనే అక్రమాలు, అరాచకాలు సాగాయి. సాక్షాత్తు ఆరోజు ఉన్నటువంటి అధికారులందరూ కూడా అదే చెప్తున్నారు. ఇప్పుడు కీలక పాత్ర పోషించిన అధికారులంతా ఒక్కొక్కరూ బయటికి వచ్చి కన్ఫెషనల్ స్టేట్మెంట్స్ ఇస్తున్నారు. కొండల బద్దలు కొట్టినట్టు చెబుతున్నారు. మొత్తం జగన్ చెబితేనే చేశామంటున్నారు. దక్షిణ కొరియాలో కిమ్ ఉన్నాడు. అతని నియంతకు మించిన అరాచకం జగన్‌ది. వైసీపీ అధికారంలో జగన్ చెప్పిందే చట్టం. చంద్రబాబుని అక్రమంగా నంద్యాల నడిరోడ్డు మీద తెల్లవారుజామును అరెస్ట్ చేసి తీసుకొచ్చి జైలుకి పంపించి పైశాచిక ఆనందం పొందాడు. ఆ అజెండాను మోసిన వారందరూ ఈరోజు పశ్చాత్తాప పడుతున్నారు" అని ఆనంద్‌బాబు దుయ్యబట్టారు.

"టిటీడి మాజీ ఈఓ ధర్మారెడ్డి.. హైకమాండ్ నిర్ణయాల మేరకే టెండర్ల సవరణలు చేశామని చెప్పారు. అలాగే మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ సైతం.. హైకమాండ్ ఆదేశాల ప్రకారమే అడిషనల్ డిజీ ఏబి వెంకటేశ్వరావు, ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిషోర్‌లమీద యాక్షన్ తీసుకునే ఫైల్‌మీద సంతకాలు పెట్టానన్నారు. ఆ పొరపాటును క్షమించమని అడుగుతూ వీడియో విడుదల చేశాడు. జగన్ హయాంలో సీఎం పేషీలో పనిచేసిన పీఏలు, ఓఎస్డీలు లిక్కర్ కేసుల్లో ఇరుక్కున్నప్పుడు.. వాళ్లూ అదే చెప్పారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లను నీచంగా విమర్శించి.. ఈరోజు చట్టానికి దొరికిన ప్రతి ఒక్కరూ పై ఆదేశాలమేరకే చేశామని అంటున్నారు. వర్రా రవీంద్రరెడ్డి, వైసీపీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి, రాజధాని ప్రాంతాన్ని రాజధాని రైతుల్ని అసభ్యంగా అభివర్ణిస్తూ.. సాక్షి మీడియాలో డిబేట్‌లో మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు సైతం వైసీపీ రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడానని చెప్పారు. ఇంతకంటే నీచం ఏమైనా ఉంటుందా? జగన్ బండారం బయట పడటం లేదా" అని ఆనంద్‌బాబు ప్రశ్నించారు.

### జగన్ రాజకీయాలకు కాదేదీ అతీతం

"నిన్న కర్నూల్ బస్సు ప్రమాదం జరిగి ప్రజలు చనిపోతే.. దానిమీద ఇష్టం వచ్చినట్టు ట్రోల్స్ చేసి సోషల్ మీడియాలో అవాకులు చవాకులు పేలారు. యాంకర్ శ్యామలకు పోలీసులు నోటీస్ ఇచ్చి పిలిపిస్తే.. హై కమాండ్ స్క్రిప్ట్ అని చెప్పింది. హైకమాండ్ అంటే జగన్మోహన్‌రెడ్డే కదా? ఇలాంటి ఘట్టాలతో ప్రజలకు జగన్మోహన్‌రెడ్డి ఏం చెప్పదలచుకున్నాడు. 11 సీట్లు పరిమితం చేసి.. ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ప్రజలు ఘోరంగా ఓడించినా.. రాష్ట్రంలో మళ్లీ అరాచకాలు, అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు చేయడం ఎక్కడి రాజకీయం. ప్రజలకే కాదు, రాష్ట్రానికీ ఇటువంటి నేర స్వభావం కలిగిన మాఫియా శక్తులతో మహా ప్రమాదం. ప్రశాంతమైన వాతావరణంలో నేడు ప్రజలిచ్చిన అధికారంతో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నేతృత్వంలో ముందుకు వెళ్తోంది. విధ్వంస రాష్ట్రాన్ని అభివృద్ధి పంథాకు తీసుకెళ్తున్న తరుణంలో.. జగన్మోహన్‌రెడ్డి అనైతిక చర్యలు ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు ఏవిధంగా కుట్రలు కుతంత్రాలు చేయాలనే దానిపై జగన్ ఆలోచిస్తున్నాడు. 14, 15న విశాఖలో జరిగే సీఐఐ సమ్మిట్‌లో రాష్ట్రానికి రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. వీటిని అడ్డుకునేందుకు జగన్ కుయుక్తులు పన్నుతున్నాడు. పీపీపీ విధానమంటే ఏంటో కూడా జగన్‌కు తెలియదు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాడు. యువగళంలో మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకి పూర్తిస్థాయిలో ఈ ప్రభుత్వం పని చేస్తుంది. ఇటువంటి వాతావరణం చెడగొట్టాలని చెప్పి మాఫియా శక్తులు జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో పని చేస్తున్నాయి. ఇలాంటి కుట్రలకు పాల్పడిన చాలామంది జైలుకెళ్లారు. మిగిలిన వాళ్ల లిస్ట్ రెడీగా ఉంది. అనైతిక శక్తులు మూల్యం చెల్లించుకోక తప్పదు. జగన్ చేష్టలకు నిరుద్యోగ యువత బలైపోయే ప్రమాదముంది. ఈ శక్తులను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కూటమి ప్రభుత్వానికి ప్రజలు సహకరించి అప్రమత్తంగా వ్యవహరించాలి. జగన్మోహన్‌రెడ్డి అనే విషవృక్షాన్ని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉంది" అని ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు.

## సరికొత్త పర్యాటకానికి బాటలు

- 98 సంస్థలతో ఎంఓయూలకు సిద్ధం
- అందుకు.. విశాఖ సీఐఐ సదస్సే వేదిక
- ప్రకటించిన మంత్రి కందుల దుర్గేష్



విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సరికొత్త పర్యాటకానికి బాటలు వేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐఐ సదస్సులో భాగంగా విశాఖపట్నంకు చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ గ్రీన్ పార్క్ హోటల్ లో వివిధ మీడియా ఛానళ్లతో పర్యాటక రంగ విశేషాలను పంచుకున్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలో ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహించి పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆహ్వానించామన్నారు. ఇప్పటివరకు దాదాపు 12 వేల కోట్లకు పైగా పర్యాటక రంగ పెట్టుబడులు సాధించామన్నారు. ఈ భాగస్వామ్య సదస్సులో భాగంగా రాష్ట్రం మొత్తం పర్యాటక రంగంలో 98 ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. అన్ని పర్యాటక విభాగాలను సద్వినియోగం చేసుకుంటున్నామన్నారు. సముద్రతీరంలో వెల్ నెస్ సెంటర్లు, ఎకో టూరిజంలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. పర్యాటక రంగంలో మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులతో పాటు 2, 3 స్టార్ హోటళ్లు తెస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల వారికి అందుబాటులో పర్యాటకం ఉంటుందని హామీ ఇచ్చారు. పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని విభిన్న పర్యాటక ప్రక్రియలకు శ్రీకారం చుట్టామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, నూతన పర్యాటక పాలసీ 2024-29 తో పర్యాటక రంగానికి ఊతం వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.

### నేటి నుంచి దివ్యాంగులకు

## 'సదరం' స్లాట్ల బుకింగ్ పునఃప్రారంభం

- వచ్చే నెలాఖరు వరకు కొనసాగింపు
- తొలిసారిగా ఉచిత సేవలకు శ్రీకారం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

విజయవాడ (చైతన్య రథం): దివ్యాంగుల కోసం 'సదరం' కింద స్లాట్ల బుకింగ్ శుక్రవారం నుంచి పునఃప్రారంభించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సాంకేతిక కారణాలతో గత సెప్టెంబరు నెలాఖరు నుంచి నిలిచిన స్లాటు బుకింగ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభించి, వచ్చే నెలాఖరు వరకు కొనసాగిస్తామని వెల్లడించారు. ఇప్పటికే నిరీక్షణ జాబితా (వెయిటింగ్ లిస్టు)లో ఉన్న సుమారు 10 వేల మందికి స్లాటు బుకింగ్ ఖరారులో తొలి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఆ తరువాత కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి స్లాట్లు (తేదీ, సమయం) కేటాయిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు స్లాట్ బుకింగ్‌కు 40 రూపాయలు, జారీ చేసిన సర్టిఫికెట్ ముద్రణకు రూ.40 చొప్పున ఫీజులు వసూలు చేసేవారని దివ్యాంగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఇకపై ఫీజులు తీసుకోకూడదని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు.

సదరం కింద సామాజిక ఆసుపత్రుల్లో



ప్రతి సోమవారం, ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లో ప్రతి మంగళవారం దివ్యాంగులకు వైద్యుల ద్వారా వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రకారం వచ్చే నెలాఖరు నాటికి 31,050 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తామని తెలిపారు. ఇంతకు ముందు 112 ఆసుపత్రుల్లో పరీక్షలు జరిగాయని, ఈ సారి అదనంగా మరో ఆరు ఆసుపత్రులను ఈ జాబితాలో చేర్చామని వెల్లడించారు. వైద్యుల అందుబాటుకు అనుగుణంగా అసుపత్రులను ఖరారు చేసినట్లు చెప్పారు. కాళ్లు, చేతుల సమస్యలు (లోకోమోటర్), కంటి చూపు మందగించడం, వినికిడి లోపం, మానసిక వైకల్యం, మందబుద్ధి కేటగిరీల్లో దరఖాస్తుదారులకు ఉన్న వైకల్య శాతాన్ని అనుసరించి వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. వీటికి అనుగుణంగా పింఛన్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి అర్హత లభిస్తుందన్నారు.

**అప్పీల్ చేసుకునే వారికి కూడా పరీక్షలు**

గతంలో వైకల్యం తక్కువగా నిర్ధారణ అయిన వారికి అప్పీల్ అవకాశాన్ని కల్పించగా 1,04,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటివరకు 19,235 మందికి తిరిగి పరీక్షలు జరిపారని తెలిపారు. మిగిలిన వారికి కూడా పరీక్షలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షలు ఆయా జిల్లాల కలెక్టర్లు ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో జరుగుతాయని సెకండరీ హెల్త్ డైరెక్టర్ (డీయస్‌హెచ్) కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి అప్పీల్ చేసుకున్న వారందరికీ పరీక్షలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

**జనవరి నుంచి 1.87 లక్షల మందికి రీ- అసెస్ మెంట్ పరీక్షలు**

పింఛన్ పొందే వారిలో మిగిలిన 1.87 లక్షల మందికి రీ అసెస్‌మెంట్ పరీక్షలు జరపాల్సి ఉందని డీయస్‌హెచ్ చక్రధర్ బాబు తెలిపారు. వీరికి జనవరి నుంచి రీ-అసెస్ మెంటు పరీక్షలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# మాజీమంత్రి బుగ్గన అండతో భూ కబ్జా

- మాయమాటలతో మోసం.. కూతురు మరణంపై
- న్యాయం కోసం కన్నతండ్రి ఆక్రందన
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం.. చట్టబద్ధ భూమి రెడ్ మార్క్‌లోకి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ఏపీ సీడాప్ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు

మంగళగిరి (చైతన్యరథం): నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన నాగరాజు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చారు. తమ పేదరికాన్ని గుర్తించి ప్రభుత్వ తన భార్య పేరు మీద 0.02 సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేసిందని కానీ ఆ స్థలాన్ని ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలం ఖాళీగా ఉంచిన సమయంలో ఐదుగురు వ్యక్తులు ట్రాక్టర్లతో వచ్చి భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ భూమి ప్రస్తుతం సమీన్ అనే మహిళ, ఆమె తండ్రి గఫార్ ఆధీనంలోకి తీసుకున్నారని వాపోయారు. అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అండతో స్థలాన్ని గుంజుకున్నారన్నారు. తమపై జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పరిధిలో ఫిర్యాదు చేసినప్పటికీ డీఎస్పీ స్థాయిలో ఆ కేసును బలహీనపరిచే ప్రయత్నాలు జరిగాయన్నారు. రాజకీయ ఒత్తిడితో తనకు న్యాయం జరగలేదన్నారు. దయచేసి వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు ఏపీ సీడాప్ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబులను కోరారు.

**కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు: వివాహిత తండ్రి ఆక్రందన**

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన దశరథరామయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి తన గోడు వెళ్లబోసుకున్నారు. దశరథరామయ్య తమ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె సుధారాణి వివాహం జరిగిన తరువాత భర్తతో మనస్పర్థలు ఏర్పడటంతో విడాకులు తీసుకుంది. ఈ క్రమంలో సంవత్సరం క్రితం తమ కుమార్తెకు నిడమానూరు వాసి గోగులమూడి రాముతో పరిచయం ఏర్పడి ఇష్టప్రకారం విజయవాడ సింగ్ నగర్‌లోని కార్తికేయ ఆసుపత్రి సమీపంలో కలిసి జీవనం ప్రారంభించారు. రాము బీ ఆర్మీ న్యూస్ ఛానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. సుధారాణికి 20 కాసుల బంగారం ఉంది. ఈ నేపథ్యంలో గత ఆగస్టు 21వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో రాము దశరథ రామయ్యకు ఫోన్ చేసి మీ అమ్మాయి గుండెపోటుతో చనిపోయింది అని తెలిపాడు. వెంటనే తను అక్కడికి వెళ్లి వివరాలు అడిగినపుడు రాము బేలముఖంతో నాటకమాడి సంఘటననుండి



వారి మనసును మళ్లించాడు. మీకు ఇవ్వవలసిన రూ.30 లక్షలు ఇస్తాను, పిల్లలను చూసుకుంటాను అని చెప్పి నమ్మించాడు. అప్పటినుండి నేటి వరకు ఆ డబ్బు ఇవ్వలేదు. అలా చేయడానికి రాము స్నేహితుడు పి.రాజేష్ కూడా ఈ వ్యవహారంలో భాగస్వామిగా ఉన్నాడని తనకు అనుమానం ఉందని దశరథరామయ్య అర్జీలో పేర్కొన్నాడు. తన కుమార్తె మరణం వెనుక అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయని వాపోయాడు. దయవుంచి సదరు రాము, రాజేష్‌పై పూర్తి స్థాయి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరాడు.

**మా భూమిలోకి మమ్మల్ని వెళ్లనివ్వడం లేదు: అన్నపూర్ణ ఆవేదన**

తన భూమిలోకి తాను వెళ్లడానికి అన్యాయంగా అడ్డుకుంటున్నారని విజయనగరం జిల్లా రేగిడి ఆముదాలవలస మండలం మజ్జిరాముడుపేట గ్రామానికి చెందిన అన్నపూర్ణ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కేవం వలస గ్రామం పరిధిలో తనకు రెండెకరాల 98 సెంట్ల భూమి ఉందని, సర్వే నెం 7/16లో య.1.16 సెంట్ల ఈ భూమిపై తమకు ఎటువంటి చట్టపరమైన సమస్యలు లేకపోయినా స్థానిక తహసీల్దార్ సరైన సంతకం లేకుండా బౌండరీ తప్పుగా గుర్తించి తమ భూమిని రెడ్ మార్క్ పెట్టి భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయాడు. దీనిపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

**ఎస్సైతో కలిసి కేసులతో వేధిస్తున్నారు**

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం పాలెంపల్లికి చెందిన షబీర గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో చాంద్ భాషా అనే వ్యక్తికి డబ్బులు చెల్లించి స్థలం కొనుగోలు చేశామని, ఆ స్థలంపై చుట్టు పక్కల ఉండే కొంతమంది వ్యక్తులు అనవసరంగా గొడవపడి స్థలం తమదేనని వాదిస్తూ దాడి చేసి తనను తన కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి దిగారని వాపోయారు. ఈ ఘటనపై పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు తమ ఫిర్యాదును స్వీకరించకుండా బయటకు పంపించారని వాపోయాడు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**ఎస్సై మా చదువులను అడ్డుకుంటున్నారు**

తిరుపతి జిల్లా చిట్టామూరు మండలం గుణపాటిపాలెం గ్రామానికి చెందిన మనోహర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమ కుటుంబం నివసిస్తున్న ఇంటి స్థలం విషయంలో కొందరు మోసపూరితంగా కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక ఎస్ఐ తనపై, తమ కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. చదువుకుంటున్న తమపై ఎఫ్ఐఆర్ పెట్టి విద్యను కొనసాగించకుండా అడ్డుకుంటున్నారు. తమయందు దయవుంచి వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**రహదారిని కబ్జా చేసి కాలువను మరుగుదొడ్లుగా మార్చేశారు**

పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం ఆనందపేట గ్రామానికి చెందిన జాన్ బాబు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చికి దక్షిణ వైపు ఉన్న పాత రహదారిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి మరుగుదొడ్లు నిర్మించారని ఆరోపించాడు. వాటికి సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేయకుండా నేరుగా పేరమ్మ వాగులో పైపులు కలపడంతో వాగు పొంగినపుడు మలిన జలాలు రోడ్లపైకి వచ్చి ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడుతోందని వాపోయాడు. అలాగే ఆ నీరు ఇళ్లలోకి చేరి ప్రజలకు తీవ్రమైన అసౌకర్యాలు, ఆరోగ్య సమస్యలు కలుగుతున్నాయని పేర్కొన్నాడు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు అందజేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తిరుపతి జిల్లా కోట మండలం వజ్జావారిపాలెం గ్రామానికి చెందిన రామయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో పూర్వీకుల నుండి ఉపయోగిస్తున్న గ్రామ మేత (పోరంబోకు) భూమిని 2023లో అప్పటి తహసీల్దారు కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు సర్వే నంబర్లు 521, 522, 523 లుగా విభజించి డీఫారమ్ పట్టాలు జారీ చేశారని వాపోయారు. ఆ పట్టాదారులు తమ గ్రామానికి చెందినవారు కాదని ఈ నిర్ణయం అక్రమంగా తీసుకున్నారని ఆరోపించాడు. తమయందు దయవుంచి ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి ఆ మేత భూమిని తిరిగి తమకే అప్పగించవలసిందిగా కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# బ్రాండ్ ఇమేజ్‌తో ఏపీకి పెట్టుబడుల వెల్లువ

## •గూగుల్, సీఐఐ సమ్మిట్ ఆహ్వాన సైకత శిల్పాన్ని సందర్శించిన : ఎమ్మెల్యే గంటా



రుషికొండ (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సీఐఐ సమ్మిట్.. గూగుల్ డేటా సెంటర్‌లను స్వాగతిస్తూ రుషికొండ బీచ్‌లో తయారు చేసిన సైకత శిల్పాన్ని గురువారం సందర్శించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అయిదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రంలోని పరిశ్రమలను జగన్మోహన్ రెడ్డి తరిమేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అంతర్జాతీయ సంస్థలు రూ. లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు రావడం శుభసూచకమని పేర్కొన్నారు. సీఐఐ సమ్మిట్‌లో రూ. 10 లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు జరగనున్నాయని.. అనేక మంది పెట్టుబడిదారులు తమ ఒప్పంద ప్రతిపాదనలకు సమ్మిట్‌లో చోటు కల్పించాలని ఇప్పటికీ కోరుతున్నారని వెల్లడించారు. విశాఖకు వచ్చే పరిశ్రమల్లో అత్యధిక శాతం భీమిలి నియోజకవర్గంలోనే ఏర్పాటు కావడం పట్ల స్థానిక ఎమ్మెల్యేగా ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రతిష్టాకరమైన గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడాన్ని.. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ఉద్దేశించిన సీఐఐ సమ్మిట్ విశాఖలో జరగడాన్ని ఆహ్వానిస్తూ.. ఆ కాన్సెప్ట్‌తో బీచ్‌లో సైకత శిల్పాన్ని తయారీ చేసిన శిల్పి అప్పలనరసింహాన్ని గంటా అభినందించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, ఏపీటీడీసీ ఆర్డీ కల్యాణి, జిల్లా టూరిజం అధికారి మాధవి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మీ, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, కె. అచ్యుతరావు, శాఖారి శ్రీనివాస్, దొరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పదవులు పొందిన ప్రతి ఒక్కరు బాధ్యతతో నడుచుకోవాలి : బూరుగుపల్లి



నిడదవోలు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిడదవోలు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో వేలివెన్ను గ్రామంలో రైతు సంఘం భవనంలో పట్టణ, మండల, గ్రామ కమిటీలతో పాటు, క్లస్టర్, కో క్లస్టర్, ఇన్‌ఛార్జ్‌లు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌ల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు వివిధ పదవులు పొందిన ప్రతి ఒక్కరు ప్రమాణం చేసి తమకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, పార్టీ బలోపేతం కోసం అన్ని విధాలుగా కృషి చేయాలని బూరుగుపల్లి శేషారావు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా పనిచేయాలి : ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (చైతన్యరథం): పార్టీ బలోపేతం కోసం ప్రతిస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. గురువారం టీడీపీ పట్టణ, రెండు మండల అధ్యక్షులు కార్యదర్శులు, యూనిట్, క్లస్టర్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని స్థానిక 80 ఫీట్ రోడ్డు జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల, యూనిట్, క్లస్టర్, గ్రామ, బూత్‌కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ... పార్టీ బలోపేతం కోసం ప్రతి స్థాయిలో సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువగా ఉండి, ప్రభుత్వ పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, యూనిట్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మంగళగిరిలో టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారమహోత్సవం



మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ నాయకులు పేర్కొన్నారు. గురువారం మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలోని పద్మశాలి బహుత్తమ సంఘం కల్యాణ మండపంలో నూతన మండల, పట్టణ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్, వార్డ్, గ్రామ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావులు అన్ని కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి వారికి అభినందనలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు, ప్రజలకు విశ్వసనీయంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళు లర్పించారు. నూతన కార్యవర్గంతో పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ... వివిధ కమిటీలలో నియమితులైన వారు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కుటుంబ సాధికార సారథులు నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఉన్న నేతలు, కార్యకర్తలంతా కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలని సూచించారు. గత కమిటీ సభ్యులు అందరూ బాగా పని చేసి మంత్రి నారా లోకేష్‌కు 91 వేలకు పైగా మేజార్టీ వచ్చేందుకు ఎంతో కృషి చేశారని, ఇప్పుడు నూతన కార్యవర్గం కూడా ఆ విధంగా పని చేయాలని కోరారు. పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ... మంత్రి నారా లోకేష్ చొరవతో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. పదవులు పొందిన నాయకులు బాధ్యతతో పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు.

# కోటబొమ్మాళిలో ప్రమాణస్వీకారోత్సవాలు



టెక్కలి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు గురువారం టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నియోజకవర్గ పరిశీలకులు కొండేపల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్, గ్రామ కమిటీలతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి మండల అధ్యక్షులు బోయిన రమేష్, టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, నందిగాం మండల అధ్యక్షులు వెనకా, నందిగాం మండల అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, సంతబొమ్మాళి మండల అధ్యక్షులు జీరు భీమారావు, వెలమల కామేశ్వరరావు, హనుమంతు రామకృష్ణ, మట్ట సుందరమ్మ, రెడ్డి అప్పన్న, మల్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై పసుపు జెండా ఎగరాలి



కురుపాం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక ఎన్నికల్లో వందశాతం విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం పార్టీ మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముందుగా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎల్విన్‌పేట కూడలిలో అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్విన్ పేట కూడలి నుండి బి.ఎస్.ఆర్ కళ్యాణ మండపం వరకు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తోయక జగదీశ్వరి మాట్లాడుతూ... పార్టీ ఎంతో నమ్మకంతో ప్రజాస్వామ్యబద్ధంగా కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. పార్టీ నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా... ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అప్పుడే ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అప్పుడే విజయం సాధించే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటిపైన పసుపు జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ కూడా సమిష్టిగా కృషి చేసి గెలుపుకి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు గుర్తించడమే నాయకుడి లక్షణం

## ● ఆముదాలవలసలో కూన ఆధ్వర్యంలో ఘనంగా ప్రమాణస్వీకారోత్సవం



ఆముదాలవలస (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ మండల, యూనిట్, క్లస్టర్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై, కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పార్టీ నుండి ప్రత్యేక పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ బుద్ధా నాగ జగదీశ్వరరావు హజరైయ్యారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ... పార్టీ బలోపేతం కోసం ప్రతి స్థాయిలో సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువగా ఉండి, ప్రభుత్వ పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కారం దిశగా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రమాణ స్వీకారం అనంతరం నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, యూనిట్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : జీవీ ఆంజనేయులు

**●ఉద్యాన పంట సాగుతో రైతుకు ఆర్థిక ప్రగతి... ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేయండి**



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో రైతు సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం మండలం బొందిలపాలెం గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ఉచితంగా ఎలుకల నిర్మూలన మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామూహిక ఎలుకల నివారణ చేపట్టి పంటలను కాపాడుకోవాలని కోరారు. రైతులకు పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు సకాలంలో అందిస్తూ రైతు సంక్షేమ లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రైతులను గాలికి వదిలేసారని, ఎన్డీఏ పాలనలో రైతులు ఆర్థిక ప్రగతి సాధించేందుకు 90% రాయితీపై డ్రిప్ ఇరిగేషన్, మైక్రో న్యూ ట్రేడ్లు, వ్యవసాయ పరికరాలు అందించడమే కాక, ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతు అధిక దిగుబడి ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రైతులు వరి పంట తో పాటు, సాగునీరు పుష్కలంగా ఉన్న మెరక ప్రాంతాల్లో ఉద్యాన పంటలైన పండ్లు కూరగాయలు సాగు చేసి అధిక ఆదాయంతో ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. వినుకొండ నియోజకవర్గంలో ఈ ఏడాది 25 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులు పంట సాగులో మెలకువలు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ప్రతి ఇంటిపై (సూర్య ఘర్) సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. సోలార్ వలన ప్రతి ఒక్కరికి విద్యుత్ ఖర్చు ఆదావుతుందని, పర్యావరణానికి మేలు జరుగుతుందని, విద్యుత్తు గ్రిడ్డుకు అమ్మడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని ఆయన తెలిపారు. సోలార్ ప్యానెల్ ప్రతి ఇంటిపై ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సౌకర్యం కల్పించిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల నాయకులతోపాటు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో ఘనంగా టీడీపీ కమిటీల ప్రమాణస్వీకారాలు

**●కమిటీ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ డివిజన్ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌ల ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మేయర్ కోవెలమూడి రవీంద్ర, దేగల ప్రభాకర్, మల్లె ఈశ్వర్‌రావు, నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి తదితరులు హాజరయ్యారు. తొలుత తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడుతూ... అనుకోని అవకాశంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అడుగు పెట్టాను. అడుగుపెట్టినప్పటి నుంచి ప్రజల నమ్మకం, తెలుగుదేశం పార్టీ గొప్పతనం కలిసినప్పుడే నేను ఏదైనా చేయగలను అనే ధైర్యం వచ్చింది. 50 సంవత్సరాల రాజకీయ అనుభవం లేకున్నా, తల్లిదండ్రులు లేదా తాతలు ఎమ్మెల్యేలు కాకపోయినా కేవలం ఒకటిన్నర సంవత్సరంలోనే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విశేష అభివృద్ధి చూపించగలిగాం. ఇది ప్రజల నమ్మకం, కార్యకర్తల కృషి ఫలితం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవ్వడం, కార్యకర్తలతో నిరంతరం కలిసి ఉండటం తన ధ్యేయమని, ఇందుకోసం ప్రతి మంగళవారం మహిళా గ్రీవెన్స్ డే, బుధవారం కార్యకర్తలతో ముఖాముఖి, గురువారం ఫీల్డ్ విజిట్స్, శుక్రవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాను. ప్రజలతో ఎప్పుడూ మమేకమయ్యే నాయకుడికి ఎప్పటికీ ఓటమి రాదు" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. కార్యకర్తలతో నేరుగా మమేకమయ్యే వేదికగా ప్రతి బుధవారం 'కార్యకర్తలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకరి మీద ఒకరికి ఉన్న అభిప్రాయ భేదాలను సయోధ్యతో పరిష్కరించుకోవాలి" అని పిలుపునిచ్చారు.

# గ్రామస్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలి : మండలి



అవనిగడ్డ (చైతన్యరథం): గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు బాధ్యతగా పని చేసి అక్రమాలు, ఆక్రమణలు అరికట్టాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం అవనిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్- గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేసేలా మండల అధికారులు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న సిబ్బంది పనితీరును మండల అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజా దర్బారులో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్.. వాటిని పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

# ప్రతి సమస్యను మా దృష్టికి తీసుకురండి : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి (చైతన్యరథం): సత్తెనపల్లి పట్టణం 6వ వార్డు ముఖ్య నాయకులతో సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ సచివాలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డులోని ప్రజలు తీసుకువచ్చిన గృహ పెన్షన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే త్వరితగతిన పరిష్కరిస్తామని కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు ప్రతి ఇంటికి వివరించాలన్నారు. ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందు ఉంచేలా పని చేయాలని, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసే విషయంలో పారదర్శకతతో అధికారులు పని చేయాలని కన్నా లక్ష్మీనారాయణ సూచించారు.

# విజన్ - 2047 లక్ష్యసాధన దిశగా పీ-4

**● కార్యాచరణ, క్షేత్రస్థాయి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి : ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమిప్రభుత్వ ప్రధాన ఆశయమైన పీ-4 అమల్లో అధికారులు, నిర్లక్ష్యాన్ని వీడాలని, గ్రామ, మండల, పట్టణస్థాయి నాయకులతో సమన్వయం చేసుకుంటూ బంగారుకుటుంబాల కలలు, ఆశయాల్ని నిజం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పీ-4 అమలు, ప్రజలు అందించే అర్జీల పరిష్కారంపై (పీజీఆర్ఎస్)పై నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందు నిలపడంతో పాటు.. పేదరికాన్ని నిర్మూలించి, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4కు శ్రీకారం చుట్టారని ప్రత్తిపాటి తెలిపారు. పీ-4 విశిష్టత, విధివిధానాలపై అధికారులు అవగాహన పెంచుకొని, ఆచరణలో అద్భుత ఫలితాలు సాధించినప్పుడే ముఖ్యమంత్రి ఆశయం నెరవేరుతుందన్నారు. విజన్ - 2047 లక్ష్య సాధన దిశగా అభివృద్ధి, సంక్షేమంలో ఏపీని పరుగులు పెట్టిస్తున్న దార్శనిక నాయకుడి ఆలోచనల అమల్లో మనవంతు పాత్ర పోషించడం మనందరి బాధ్యతనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. పేదలకు అండగా నిలవాలన్న ఆలోచనాపరులందరినీ పీ-4లో భాగస్వామ్యుల్ని చేయండి. ఎవరికి తోచిన సాయం వారు బంగారు కుటుంబాలకు అందించేలా చూడండి. పేదరిక నిర్మూలనకు దోహదపడే పీ-4లో భాగంగా సచివాలయ సిబ్బంది గుర్తించిన బంగారు కుటుంబాల బాధ్యతల్ని మార్గదర్శులకు అప్పగించడంతో పాటు, మార్గదర్శుల ఎంపికలో అధికార యంత్రాంగం చురుగ్గా వ్యవహరించాలని ప్రత్తిపాటి సూచించారు. స్థానికంగా ఉండే ఎన్ఆర్ఐలు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారి వివరాలను ఆయా గ్రామ, మండల, పట్టణ నాయకుల్ని సంప్రదించి సేకరించాలని, వారి ద్వారా మార్గదర్శులకు చేరువ కావాలన్నారు. బంగారు కుటుంబాల పూర్తి సమాచారాన్ని, పేదల స్థితిగతుల్ని ఎన్ఆర్ఐలకు వివరించి, ఏ విధంగా ఆయా కుటుంబాలను ఆదుకోవాలో తెలియచేయాలన్నారు. పేదలకు అండగా నిలవాలనే ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరినీ మార్గదర్శుల జాబితాలో చేర్చాలని ప్రత్తిపాటి సూచించారు.

# యార్లగడ్డకు రామన్నగూడెం ప్రజల కృతజ్ఞతలు



హనుమాన్ జంక్షన్ (చైతన్యరథం): బాపులపాడు మండలం రామన్నగూడెం గ్రామంలో గత కొన్ని సంవత్సరముల నుంచి జిల్లా పరిషత్ రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. నడవడానికి, బైక్లు, ఆటోలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉండటంతో గ్రామ ప్రజలు మన కూటమి నాయకులు అందరూ కలిసి డిసి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్‌కి తెలియచేసారు. ఆయన వెంటనే స్పందించి మన గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్, అయిన యార్లగడ్డ వెంకట్రావు సమస్యను వివరించి ప్రజల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే యార్లగడ్డ తక్షణమే స్పందించి అధికారులతో మాట్లాడి తాత్కాలిక మరమ్మత్తుల నిమిత్తం ఐదు లారీల్లో గ్రావెల్ మన రామన్నగూడెం గ్రామానికి పంపించడం అలాగే జెసిబి సహాయంతో పోసిన గ్రావెల్‌ని దగ్గర ఉండి కూటమి నాయకులు సర్పంచ్ చదును చేయించడం జరిగింది. మన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ పిలిస్తే పలికే మంచి మనిషి గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి బాటలో వెళ్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్‌కి మన రామన్నగూడెం గ్రామ ప్రజలు తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము. అట్లాగే సమస్యల పరిష్కారంలో వేగవంతం గా స్పందిస్తున్న వెంకట్రావ్ గన్నవరం గడ్డమీద మళ్లీ మళ్లీ ఎమ్మెల్యేగా ఉండాలని మనస్ఫూర్తిగా రామన్నగూడెం గ్రామ ప్రజల తరపున కోరుకుంటున్నాం.

# రైతాంగానికి అండగా ఉంటాం : కుమార్‌రాజా



మొవ్వ (చైతన్యరథం): కృష్ణా ఎన్టీఆర్ జిల్లా మొవ్వ మండలం అయ్యంకిలో కోత మిషన్లతో నూర్పిడి చేసిన ధాన్యం గింజలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతాంగానికి అండగా ఉండాలన్నారు. రైతన్నకు కావలసిన గోనె సంచులు, వర్షం వస్తే ఇబ్బంది లేకుండా పట్టాలను సిద్ధం చేశారు. ధాన్యం అమ్మకాల్లో ఆర్.బి.కె కేంద్రం నిర్ణయించిన తేమ శాతమే ఫైనల్ అన్నారు. మిల్లర్లు పెట్టే ఇబ్బందులకు చెక్ పెట్టేలా ప్రతి మిల్లు వద్ద కస్టోడియన్ అధికారిని నియమించినట్లు చెప్పారు.

# అవినీతిఘనుడు బుర్రా మధుసూదన్

- కనిగిరిలో కోట్లు దోచుకుని, ఇక్కడికి వచ్చి నీతులు చెప్పడమా
- కందుకూరులో అవినీతి రహితంగా ఇంటూరి పాలన
- మీడియా సమావేశంలో వైసిపి నేతలపై నిప్పులు చెరిగిన టీడీపీ నాయకులు



కనిగిరి (చైతన్యరథం): నియోజకవర్గంలో అవినీతిలో నిండా మునిగి తేలిన బుర్రా మధుసూదన్ యాదవ్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. అవినీతి రహిత పరిపాలన చేస్తున్న ఎమ్మెల్యే పట్ల మరోసారి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామని అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు మాట్లాడుతూ... బుర్రా మధుసూదన్ అవినీతి గురించి కనిగిరి ప్రజలు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నిజంగా అక్కడ ఆయనకు మంచి పేరు ఉంటే, 2024 ఎన్నికల్లో కూడా టిక్కెట్ ఇచ్చి ఉండేవారని అన్నారు. అన్ని విధాలుగా దోచుకున్నారు కాబట్టే కందుకూరుకు ట్రాన్స్ఫర్ చేశారని గుర్తు చేశారు.

కందుకూరు పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మాట్లాడుతూ... కందుకూరులో అవినీతి జరుగుతున్నట్లు ఒక్క ఆధారమైనా చూపించగలరా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్‌ను ఇష్టం వచ్చినట్లు తవ్వి తరలించుకు పోయింది వైసీపీ నేతలేనని స్పష్టం చేశారు. వైసీపీకి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ విచ్చలవిడిగా ఇసుకను అమ్ముకున్నారని విమర్శించారు. ఆ విషయాన్ని వైసిపి ఎమ్మెల్సీ అయిన తుమాటి మాధవరావు స్వయంగా సోషల్ మీడియా గ్రూపుల్లో ఆధారాలతో సహా పెట్టిన సంగతి మరిచిపోవద్దన్నారు. ఇకనైనా ఆయన వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని మల్లేశ్వరరావు ఘాటుగా హెచ్చరించారు.

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ రఫీ మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో బిఎస్ఎన్ఎల్ కాంప్లెక్స్ నిర్మాణం నూటికి నూరుపాళ్ళు అక్రమమేనని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలోనే అక్రమ నిర్మాణం జరిగిందని, అప్పుడే తమ నాయకుడు ఇంటూరి నాగేశ్వరరావు పదేపదే దానిపై మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు.

నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ మాట్లాడుతూ... బుర్ర మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు ఉచిత బస్సు పథకం వల్ల ఊరికే పని లేకుండా తిరుగుతున్నారని మహిళలను అవమానించే రీతిలో మాట్లాడారని, ఆ మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, మహిళలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# పదవీ అలంకార ప్రాయం కాదు... బాధ్యత

- పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి
- ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- ఎమ్మెల్యే ముత్తుముల సమక్షంలో నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



గిద్దలూరు (చైతన్యరథం): పదవీ అలంకార ప్రాయం కాదు ఒక బాధ్యత అని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు సభ్యులు, అనుబంధ విభాగాలు, గ్రామ పార్టీ అధ్యక్షుల చేత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అర్ధవీడు మండల పార్టీ అధ్యక్షులుగా బండ్లమూడి ఆంజనేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కొణతం రంగారెడ్డి, కంభం మండల పార్టీ అధ్యక్షులుగా తోట వెంకట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆరెపల్లి మల్లికార్జున, బేస్తవారిపేట మండల పార్టీ అధ్యక్షులుగా సొరెడ్డి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుంటక నరసింహ యాదవ్, రాచర్ల మండల పార్టీ అధ్యక్షులుగా కటికె యోగనంద్, ప్రధాన కార్యదర్శిగా యాసం లక్ష్మిరెడ్డి, గిద్దలూరు మండల పార్టీ అధ్యక్షులుగా మార్తాల సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొమ్మినేని వెంకటేశ్వర్లు (గడికోట), గిద్దలూరు పట్టణ అధ్యక్షులుగా సయ్యద్ శానేశావలి, ప్రధాన కార్యదర్శిగా బొజ్జా రంగనాథ్, కొమరోలు మండల పార్టీ అధ్యక్షులుగా బోనేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బిజ్జాల తిరుమల రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ గిద్దలూరు నియోజకవర్గంలో 25 సంవత్సరాల తర్వాత తెలుగుదేశం జెండా ఎగురవేయటంలో ప్రతీ ఒక్కరూ ఎంతో కృషి చేశారని కష్టపడిన ప్రతీ కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. కూటమి పాలనలో బీసీ, ఎస్సి, మైనార్టీ, కాపు సోదరులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నామని, ప్రతీ ఒక్కరూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమం కూటమి పాలనలోనే సాధ్యమని గ్రామాల్లో అభివృద్ధి కేవలం కూటమి పాలనలోనే జరుగుతుందని, రాష్ట్రంలో అనుభవం ఉన్న నాయకుడు నారా చంద్రబాబునాయుడు, యువ నాయకులు నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం పెట్టుబడులతో పరుగులు పెడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

# కార్యకర్తల రుణం తీర్చుకుంటాం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

- వైసీపీ పాలనలో అక్రమ కేసులు, అరాచకాలు, దోపిడీని ఎదుర్కొని వీరోచితంగా పోరాడారు
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తాం



సర్వేపల్లి (చైతన్యరథం): వైసీపీ పాలనలో అక్రమ కేసులు, అరాచకాలు, దోపిడిని ఎదుర్కొని వీరోచింతగా టీడీపీ కార్యకర్తలు పోరాడారని, వారి త్యాగాలను తాను మర్చిపోనని కార్యకర్తల రుణం తీర్చుకుంటానని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డంగా తినింది అరగక రోడ్లపైకి వచ్చి నోరు పారేసుకుంటున్న వైసీపీ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. గురువారం వెంకటాచలం మండలం చెముడుగుంటలోని శ్రిడ్స్ కళ్యాణమండపంలో మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణస్వీకారోత్సవం పండగలా సాగింది. అన్ని కమిటీల సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించిన సోమిరెడ్డి... మీడియాతో మాట్లాడారు... "వైసీపీ ఐదేళ్ల పాలనలో మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే నరకం అనుభవించింది సర్వేపల్లి నాయకులు, కార్యకర్తలే. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అక్రమాలు, అన్యాయాలు జరిగాయి..ఇక్కడ మాత్రం కిరాతకాలు, అరాచకాలు, దోపిడీ జరిగాయి..మాపై దుర్మార్గమైన భాషను ప్రయోగించారు. రీసర్వే పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల భూముల రికార్డులు మార్చేశారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఇన్‌కం ట్యాక్స్ కట్టే వారి పేర్ల మీద రాసేసుకున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. లెక్కకు మించి పాపాలు చేశారు. అమాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపించారు..పోలీసుస్టేషన్లలో చిత్రహింసలు పెట్టించారు. పొలాల్లో పనిచేసుకుంటున్న వారి బైకుల్లో కర్ణాటక మద్యం సీసాలు పెట్టి అన్యాయంగా జైళ్లకు పంపించారు. ఇన్ని అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని నిలిచారు... చరిత్రలో నిలిచిపోయే విజయం అందించారు. చంద్రబాబునాయుడు నాలుగోసారి సీఎం కావాలి, రాష్ట్రాభివృద్ధి మళ్లీ గాడిలో పడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని లక్ష్యంతో పోరాడారు. సర్వేపల్లి నియోజకవర్గ కేడర్‌కు పార్టీతో పాటు నేను రుణపడివున్నా. ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటూ ముందుకు సాగుతాం ప్రస్తుతానికి మూడు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు సర్వేపల్లికి వచ్చాయి. నియోజవర్గ, మండల స్థాయిలోని పదవులన్నీ భర్తీ చేసుకుంటున్నాం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలన్నింటిలో ఘన విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలి." అని సోమిరెడ్డి పిలుపునిచ్చారు.

# పార్టీ కోసం బాధ్యతతో పనిచేయండి

- పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది : ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా వివిధ స్థాయిలలో పదవులు పొందిన నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండా ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేశారు. పదవులు పొందిన నాయకులకు శాలువతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ కోసం భాద్యతగా పని చేయాలని, కష్టపడ్డ కార్యకర్తలకు ఎల్లవేళలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజనప్ప గారితో పాటు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, మండల కన్వీనర్లు, యూనిట్, బూత్,క్లస్టర్,ఇన్చార్జిలు, రాష్ట్ర డైరెక్టర్లు, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అండగా నిలిచిన కార్యకర్తల్ని గుండెల్లో పెట్టుకుంటా

- ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సాహంగా కావలి పట్టణ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

కావలి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పార్టీ పట్ల నిబద్ధతతో, విశ్వాసంతో పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తను నా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు.నెల్లూరు జిల్లా కావలి టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగిన పట్టణ,అధ్యక్షులు క్లస్టర్, యూనిట్, బూత్, టౌన్ కమిటీల ప్రమాణ శికారోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని అభిమానులకు కేక్ తినిపించారు.. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ సభ్యులు, మహిళా నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరు ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని, పట్టణ నాయకులు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష. ప్రతి కార్యకర్తే పార్టీ బలం," అని ఎమ్మెల్యే తెలిపారు."పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కూడా టీడీపీ జెండాను గౌరవంగా ఎగరేసిన వారందరికీ గౌరవం లభిస్తుంది.కార్యకర్తల కష్టమే నేటి విజయానికి పునాది," అని పేర్కొన్నారు."ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుంది. అందరికీ పదవులు ఇవ్వాం, ఎవరికైనా మిగిలి ఉంటే తెలియజేయండి – ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వడమే మా ధ్యేయం," అని ఆమె స్పష్టం చేశారు."ప్రజల సమస్యల పరిష్కారానికి నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. మీ సమస్య నా సమస్యగానే భావిస్తాను," అని అన్నారు.



# విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన కాల్వ

రాయదుర్గం (చైతన్యరథం): బొమ్మనహాల్ మండలంలోని ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు 32 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థలో మార్పులు, సంస్కరణలు చేపడుతున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పాఠ్య పుస్తకాలు, విద్యార్థులకు పంపిణీ చేసే దుస్తుల నాణ్యత, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం విషయంలో విద్యార్థులకు సన్నబియ్యం పంపిణీ వంటి అంశాల్లో రాజీ పడబోమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉపాధ్యాయ నియామకాలను చేపట్టినట్లు చెప్పారు. ఏడేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న సైకిళ్లను బాగు చేయించి విద్యార్థులకు పంపిణీ చేయాలన్న ప్రధానోపాధ్యాయుల ఆలోచనకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# మా ప్రాణం మీరే.. ఊపిరి ఉన్నంతవరకు మీ కోసమే పని చేస్తాం

**●పరిటాల కుటుంబం కలలో కూడా తప్పు చేయదు.. చేస్తే కాలర్ పట్టుకుని నిలదీయండి**

**●పార్టీ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో పరిటాల సునీత ఉద్వేగ భరిత ప్రసంగం**




రాప్తాడు (చైతన్యరథం): మా ప్రాణం మీరే... మీరే మమ్మల్ని ముందుండి నడిపించారు.. ఊపిరి ఉన్నంతవరకు మీ కోసమే పని చేస్తామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం అట్టహాసంగా సాగింది. నగరంలోని బైపాస్ రోడ్ లో ఉన్న ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో వందలాదిగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పసుపు జెండాకు వందనం చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ఇతర నాయకులు ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలో మరణించిన తెలుగుదేశం పార్టీ సభ్యులకు నివాళి అర్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపికైన 1350మంది బూత్, గ్రామ, యూనిట్, క్లస్టర్, మండల కమిటీల సభ్యుల చేత ఉమ్మడిగా ప్రమాణ స్వీకారం చేయించి వారందరికీ శాలువాలు పూలతో సన్మానం చేశారు. కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, ముఖ్య నాయకులు మరియు మనోహర్ నాయుడు, ఆదోని కృష్ణమ్మ, తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు అంజనప్ప ఇతర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ పార్టీలో ఎంతోమంది కష్టపడి నాయకులు పనిచేశారని వారందరికీ తగిన గుర్తింపునిచ్చే బాధ్యత తమది అన్నారు. ఇప్పటివరకు చాలామంది నాయకులకు ప్రభుత్వ పరంగా పార్టీ పరంగా పదవులు వచ్చాయని వారు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఇంకా కొన్ని పదవులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరలోనే ఎంపిక చేస్తామన్నారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలు వస్తూ ఉంటాయని వాటన్నింటినీ మనసులో పెట్టుకుని ఇంట్లో అలిగి కూర్చోవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు. మీకు ఏ సమస్య ఉన్న పరిటాల కుటుంబం 24/7 అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. మనల్ని నమ్మి ఓటు వేసిన ప్రజలకు, అలాగే కష్ట కాలంలో మన కోసం పనిచేసిన కార్యకర్తలను ఎప్పటికీ మరువబోమన్నారు. వారికి ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయని ప్రకాష్ రెడ్డి ఇష్టం వచ్చినట్టు మనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత నాయకుల మీద ఉందన్నారు. నేను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను అంటే అదంతా మీరు పడ్డ కష్టం వల్లనేనన్నారు. అందుకే ఊపిరి ఉన్నంతవరకు మిమ్మల్ని మర్చిపోయే ప్రసక్తి లేదన్నారు. నా గెలుపు కోసం పనిచేసిన ఏ ఒక్కరిని నేను మర్చిపోనన్నారు. తాము పరిటాల రవి పేరును మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకే ప్రయత్నం చేస్తున్నామని... ఆయన పేరు తగ్గించే ప్రయత్నం ఎక్కడా చేయబోమన్నారు. అలా చేస్తే కాలర్ పట్టుకుని నిలదీసే హక్కు ప్రతి కార్యకర్తకు ఉంటుందన్నారు. ఊపిరి ఉన్నంతవరకు నాతోపాటు శ్రీరామ్ కూడా మీకోసమే పని చేస్తారని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

# ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటామని ప్రమాణం



ఆదోనిలో నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం



కోడూరులో బుగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారోత్సవం



శ్రీశైలంలో సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



గూడురులో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం



జమ్మలమడుగులో ప్రమాణం చేయిస్తున్న ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి



దర్శిలో గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో నూతన సభ్యుల ప్రమాణం



గూడురులో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం



జమ్మలమడుగులో ప్రమాణం చేయిస్తున్న ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి



అమలాపురంలో ప్రమాణం చేస్తున్న నూతన సభ్యులు

# స్థానిక సంస్థల్లో వంద శాతం విజయం సాధించాలి

**● కార్యకర్తలే పార్టీకి కొండంత బలం**

**● ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా**

**● టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారంలో మంత్రి సవిత**



పెనుకొండ (చైతన్యరథం): టీడీపీ మండల, గ్రామ, వార్డు, బూత్ లెవల్ కమిటీలు సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం స్థానాల్లో పార్టీ మద్దతుదారులు విజయం సాధించేలా కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ పిలుపునిచ్చారు. పెనుకొండలోని పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గంలోని 5 మండలాల పార్టీ అధ్యక్షులు క్లస్టర్, యూనిట్ ,బూత్ , గ్రామ, వార్డు, బూత్ లెవల్ కమిటీల సభ్యులతో జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్పతో కలసి ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పార్టీ కార్యాలయం వరకు నాయకులు కార్యకర్తలతో కలసి ర్యాలీగా వెళ్లారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి సవితమ్మ మాట్లాడుతూ. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తాము అండగా ఉంటున్నామని, కొందరికి పదవులు వచ్చాయని, మరికొందరికి రానున్న రోజుల్లో వస్తాయన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాల చేపడతామని చెప్పారు.నూతనంగా నియమింపబడ్డ కమిటీ సభ్యులు కార్యకర్తలకు నాయకులు అందుబాటులో ఉండి వారికి న్యాయం చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ ప్రజల మనసుల్లో నిలిచిన పార్టీ అని, మన నాయకుడు నారా చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టి, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిస్వార్థ నిబద్ధత ప్రతి తెలుగుదేశం కార్యకర్తకు స్ఫూర్తిదాయక మార్గదర్శకాలు. ఈ విలువలే మన పార్టీ బలం. ప్రతి బూత్ స్థాయిలో మన పసుపు జెండా ఎగురవేయాలని ఇంచార్జీలుగా నియమితులైన మీ అందరికి ఇది కేవలం బాధ్యత మాత్రమే కాదు ఇది ఒక గౌరవం, అని మీరు ఇప్పుడు తెలుగుదేశం పార్టీ బలం, ప్రజల విశ్వాసం,ప్రజల మధ్య ఎల్లప్పుడూ ఉండి, వారి సమస్యలు విని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలను సోషల్ మీడియాలో తిట్టుకొట్టాలని తెలియచేసిన మంత్రి సవితమ్మ. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రమణ, రాష్ట్ర స్థాయి డైరెక్టర్‌లు, నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు వివిధ హోదాలో ఉన్న నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కుప్పంలో సందడిగా ప్రమాణస్వీకారోత్సవం



కుప్పం (చైతన్యరథం): కుప్పం ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కుప్పం నియోజకవర్గ నాలుగు మండలాల నూతన మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయ సమీపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి 2029 ఎన్నికల్లో లక్ష మెజార్టీ లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని నేతలు తీర్మానించారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కుప్పం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు ఇప్పటికే ఇవ్వడం జరిగిందని ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

# ఎమ్మిగనూరులో సంస్థాగత కమిటీల ప్రమాణస్వీకారం



ఎమ్మిగనూరు (చైతన్యరథం): 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' నినాదంతో బడుగు, బలహీన వర్గాల అజెండాగా తెలుగుదేశం పార్టీని స్థాపించిన మహనీయుడు ఎన్టీఆర్... దానిని కొనసాగిస్తూ మన విజనరీ లీడర్, నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగువారి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఉండేలా రాష్ట్రంలో అనేక పరిశ్రమలు తీసుకొచ్చి... వారి జీవిత ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నారని, అలాంటి నాయకుడికి మనం నిత్యం తోడుగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలం మరియు పట్టణ క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ, వార్డు, మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

# ఢిల్లీ పేలుడు కేసులో ఉగ్రవాది ముజఫ్ఫర్ కోసం గాలింపు

## - రెడ్‌కార్నర్ నోటీసు ఇవ్వాలని ఇంటర్‌పోల్‌ను కోరిన దర్యాప్తు బృందం




ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనతో ముడిపడి ఉన్న ఫరీదాబాద్ ఉగ్ర నెట్వర్క్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే టెర్రర్ మాడ్యూల్తో సంబంధం ఉన్న, జమ్మూకశ్మీర్లోని కాజీగుండ్‌కు చెందిన డాక్టర్ ముజఫర్‌పై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్పోల్‌ను ఢిల్లీ పోలీసులు ఆశ్రయించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్టయ్యారు. వారిలో డాక్టర్ ఆదిల్ ఒకడు. అతడి సోదరుడే ముజఫర్ నిందితులను విచారిస్తున్న క్రమంలో ముజఫర్ పేరు బయటకు వచ్చింది. 2021లో తుర్కియేను సందర్శించిన డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ ఉమర్ నబీ తదితర వైద్యుల బృందంలో ఇతడు కూడా ఉన్నట్లు నిందితులు తెలిపారు. ఈ బృందం తుర్కియేలో 21 రోజుల పాటు ఉంది.

ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన కారును డాక్టర్ ఉమర్ నబీనే నడుపుతున్నట్లు సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. డీఎన్‌ఏ నమూనాలూ మ్యాచ్ అయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ముజఫర్ పేరు బయటకు రాగానే అతడి ఆచూకీ కోసం పోలీసులు యత్నించారు. కానీ, ఆగస్టులోనే దుబాయికి పారిపోయినట్లు గుర్తించారు. ప్రస్తుతం అఫ్గానిస్థాన్లో తలదాచుకున్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అతడిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని ఇంటర్ పోల్‌ను కోరారు. ఇదిలావుండగా... ఈ కేసులో తుర్కియే పేరు బయటకు రావడాన్ని ఆ దేశం ఖండించింది. భారత్‌ను లేదా మరే ఇతర దేశాన్ని లక్ష్యంగా చేసుకుని తమ దేశం ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోందనే వాదనలను తప్పుడు, నిరాధార ఆరోపణలుగా పేర్కొంది.

# ఆల్-ఫలాపై బిగుస్తున్న ఉచ్చు

## - యూనివర్సిటీలో ఉగ్రపేలుడుకు వాడిన కారు




ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్, ఢిల్లీ పేలుడు నేపథ్యంలో హరియాణాలోని ఆల్-ఫలా యూనివర్సిటీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తాజాగా దర్యాప్తు బృందాలు వెతుకుతున్న బ్రెజ్జా కారును ఈ విశ్వవిద్యాలయంలోనే కనుగొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడుకు హ్యుందాయ్ ఐ20 కారు కారణమని నిఘా సంస్థలు గుర్తించాయి. దీన్ని నడిపింది. డాక్టర్ ఉమర్ అని కనుగొన్నారు. ఈ కేసు దర్యాప్తుతో ముడిపడి ఉన్న మారుతి బ్రెజ్జా కారును పట్టుకునేందుకు అధికారులు విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో ఆల్-ఫలా యూనివర్సిటీలోనే దాన్ని గుర్తించామని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. విశ్వవిద్యాలయం ఆవరణలోనే అది పార్క్ చేసి ఉందని వెల్లడించారు. ఈ బ్రెజ్జా కారు ఇటీవల అరెస్టయిన డాక్టర్ షాహీన్ పేరు మీద రిజిస్టరై ఉంది. ఈ ఉగ్ర మాడ్యూల్ అన్ని కార్లలో పేలుడు పదార్థాలు అమర్చి.. దాడులు జరపాలనే ప్రణాళిక రచించినట్లు నిఘా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఐ10 కారు పేలుడు సంభవించినట్లు భావిస్తున్నారు..

**ఎకోస్పోర్ట్స్ కారులో అమ్మోనియం నైట్రేట్ రవాణా..!**

ఇదిలావుండగా.. ఢిల్లీ పేలుడు నిందితుడు డాక్టర్ ఉమర్‌కు చెందిన మరో కారును ఫరీదాబాద్ జిల్లాలోని ఖాండవాలీ గ్రామంలో దర్యాప్తు బృందాలు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ కారును ఫోరెన్సిక్ నిపుణులు తనిఖీ చేయగా ముఖ్యమైన విషయాలు బయటపడ్డాయి. కారులో అమ్మోనియం. నైట్రేట్ జాడలు కనుగొన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇది అమ్మోనియం నైట్రేట్‌ను రవాణా చేసేందుకు ఉపయోగించి ఉంటారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

# మాదక ద్రవ్యాల నుంచి కశ్మీర్ విముక్తికి సమష్టి కృషి

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ పిలుపు**




మాదక ద్రవ్యాల నుంచి కశ్మీర్ విముక్తి పొందేలా అందరూ కృషి చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ పిలుపునిచ్చారు. హింస లేని సమాజం, వ్యాధి లేని శరీరం, గందరగోళం లేని మనస్సు, దుఃఖం లేని ఆత్మ తన కల అని చెప్పారు. ఇవి ప్రతి ఒక్కరి జన్మహక్కు అన్నారు. ఈనెల 11న జమ్మూకశ్మీర్లోని శ్రీనగర్ బక్షి స్టేడియంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ఎడ్యూ యూత్, డ్రగ్ ఫ్రీ కశ్మీర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 కళాశాలలు, 4 విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 20వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారందరితో శ్రీశ్రీ రవిశంకర్ మాదకద్రవ్య రహిత భవిష్యత్తు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రవిశంకర్ మాట్లాడుతూ కశ్మీర్‌ను ప్రాచీన జ్ఞానభూమిగా అభివర్ణించారు. ఇక్కడి యువత చైతన్యవంతులన్నారు. పూర్తి సామర్థ్యం గలవారని చెప్పారు. శ్వాసలోని శక్తిని ఉపయోగించడం, ధ్యానం, మరికొన్ని వ్యాయామాల ద్వారా మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి సులభంగా బయటపడవచ్చన్నారు. ధ్యానం కశ్మీర్‌కు పరాయిది కాదన్నారు. దీంతో మనసు ఆనందంగా ఉంటుందన్నారు. ధ్యానానికి ఏ మత విశ్వాసంతో సంబంధం లేదని చెప్పారు. అనంతరం జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో శ్రీశ్రీ రవిశంకర్ భేటీ అయ్యారు. ఆయనతో వివిధ అంశాలపై చర్చించారు. సామాజిక కార్యక్రమాలు, రాష్ట్రంలోని యువత భవిష్యత్తుపై చర్చించేందుకు పలువురు స్థానిక ప్రముఖులను కూడా ఆయన కలిశారు.

# అరుదైన పుష్పానికి అపురూప భద్రత

## సంరక్షణకు రిజర్వు ఫారెస్టుగా గుర్తింపు



తమిళనాడు ప్రభుత్వం ఓ రకమైన మొక్కలను సంరక్షించడానికి కొండ ప్రాంతం మొత్తాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. ఎందుకంటే ఆ మొక్కలు తమ జీవితకాలంలో ఒక్కసారే పుష్పిస్తాయి. అదీ.. 8 ఏళ్లకోసారి కావడం విశేషం. నీలగిరి జిల్లా ఊటీ దగ్గర్లో ఉండే గూడలూరులో కురింజి రకం (స్ట్రోబిలాంథెస్ సెసిలిస్) మొక్కలు ఉంటాయి. వీటికి పూసే పువ్వులను కురింజి అని అంటారు. చూడటానికి 'గంట' ఆకృతిలో ఉండే ఈ పూలు ఎక్కువగా ఊదా రంగులో, కొన్ని నీలం, తెలుపు, గులాబీ రంగుల్లో కనిపిస్తుంటాయి. కేవలం నీలగిరిలోనే ఈ తరహాలో 33 రకాలు పుష్పాలు ఉన్నాయి. సెప్టెంబరు-అక్టోబరు సీజన్లలో ఇవి పూస్తుంటాయి. అందుకే గూడలూరు సమీప ప్రాంతాన్ని అక్కడి ప్రభుత్వం అక్టోబరులో రిజర్వ్ ఫారెస్టా నోటిఫై చేసింది.

# మనోవేదనకు కళారూపమిచ్చిన చిత్రకారుడు

**జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు**



తీవ్రమైన మనోవేదనను కళారూపంగా మలిచిన అతడు ఏకంగా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాడు. చత్తీస్ గఢ్‌లోని ధంతరీ జిల్లా కురుద్ పట్టణానికి చెందిన బసంత్ సాహు స్ఫూర్తిగాథ. 30 ఏళ్ల కిందట జరిగిన ఘోర రోడ్డుప్రమాదం అతడి శరీరంలో 95 శాతం భాగాన్ని పక్షవాతానికి గురిచేసింది. అప్పటిదాకా చురుగ్గా తిరుగాడిన బసంత్ ఇంట్లో మంచానికి, వీల్ చైర్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. ఈ దశలో ఆశలు కోల్పోయినవారు తీవ్ర నిస్పృహకు గురవుతారు. అయితే విధికి ఎదురొడ్డి నిలిచినవారు అద్భుతాలు సాధిస్తారు. బసంత్ ఈ రెండో మార్గాన్నే ఎంచుకొన్నారు. పూర్వానుభవం, గురువు శిక్షణ వంటివి ఏవీ లేకున్నా చిత్రకారుడిగా కొత్త ప్రయాణం ప్రారంభించి ఎన్నో చిత్రాలకు జీవం పోశారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సందర్భంగా డిసెంబరు 3న ఢిల్లీలో బసంత్ జాతీయ అవార్డు అందుకోబోతున్నారు. మొదట్లో ఏవో పిచ్చిగీతలు గీసినా క్రమంగా పట్టు సాధించాను. నాకు ఆదర్శ నాయకుడైన మహాత్మాగాంధీ చిత్రంతో ఈ కళకు శ్రీకారం చుట్టాను. స్నేహితుల ప్రోత్సాహం మరింత బలాన్ని ఇచ్చింది. ఇప్పుడు నా జీవితంలో నిస్పృహకు చోటు లేదు. నాదో రంగుల లోకం. బసంత్ ఫౌండేషను ఏర్పాటుచేసి పిల్లలకు చిత్రకళ నేర్పుతున్నా" అని బసంత్ తెలిపారు.

# దర్యాప్తు నివేదికలో పైలెట్లను ఏమీ అనలేదు

**అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై సుప్రీం**



అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై విడుదల చేసిన ప్రాథమిక నివేదికలో పైలట్‌ను నిందించలేదని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ ఘటనపై 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' దర్యాప్తు బృందాన్ని అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయామాల్య వాగ్చిలతో కూడిన సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.. ఎయిరిండియా ప్రమాదంలో మృతి చెందినవారిలో కెప్టెన్ సుమీత్, కో-పైలట్ క్లైవ్ కుందర్లు కూడా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ తండ్రి పుష్కరాజ్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఏఏఐబీ దర్యాప్తు అనేది ఒకరిని నిందించేందుకు కాదు. మరోసారి అటువంటి తప్పిదం జరగకుండా ఉండటానికి కారణాన్ని వెలికితీసేందుకు ఉద్దేశించింది మాత్రమే" అని జస్టిస్ బాగ్చ్ తెలిపారు. ఓ ఎన్జీవో తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. ఈ దుర్ఘటనపై 'కోర్టు ఆఫ్ ఎంక్వైరీ" మాదిరి సమాంతర విచారణ నిర్వహించాలన్నారు. సంబంధిత విమానాలను నమ్మలేమని, వాటిలో ప్రయాణించేవారికి ప్రమాదం పొంచి ఉందని పైలట్ ఫెడరేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. అయితే... ప్రస్తుత వాదనలు విమానయాన సంస్థల మధ్య పోరుగా మారకూడదని జస్టిస్ సూర్యకాంత్ వారించారు. సుమీత్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందన తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ తాను ఆదేశించారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై 'ఏఏఐబీ' జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే విమానం కూలిపోయింద ని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధా నమివ్వడం కాక్పిట్ వాయిస్ రికార్డర్లో నమోదైందని తెలి సింది. దీంతో పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి.

# ముగిసిన 'షట్ డౌన్'!

**- ఫండింగ్ బిల్లుపై ట్రంప్ సంతకం**

అమెరికా చరిత్రలో అత్యధిక కాలం కొనసాగిన ఆర్థిక 'షట్‌డౌన్'కు ఎట్టకేలకు ముగింపు పడింది. షట్ డౌన్‌ను ముగించే ప్రభుత్వ ఫండింగ్ బిల్లుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి సంతకం చేశారు. దీంతో 43 రోజుల సుదీర్ఘ షట్ డౌన్‌కు అధికారికంగా ముగింపు లభించింది. అంతకుముందు ప్రతినిధుల సభలో 222-209 తేడాతో బిల్లుకు ఆమోదం లభించింది. ఇప్పటికే సెనెట్‌లో దీనికి ఆమోద ముద్ర పడింది. ఈ బిల్లుపై సంతకం చేయడానికి ముందు ట్రంప్ మాట్లాడుతూ... "మన దేశం ఎన్నటికీ దోపిడీకి లొంగబోదనే స్పష్టమైన సందేశాన్ని ఈరోజు మనం ప్రపంచానికి పంపిస్తున్నాం" అని అన్నారు. డెమోక్రాట్ల చర్యల కారణంగా అమెరికా కొంతకాలం విపత్తు పరిస్థితులను ఎదుర్కొందని వ్యాఖ్యానించారు. అనంతరం ఫండింగ్ బిల్లును ఆమోదించారు. షట్‌డౌన్ ప్రారంభమైన తర్వాత నుంచి ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన ఫెడరల్ ఉద్యోగుల తొలగింపులను ఈ బిల్లు రద్దు చేయనుంది. దేశ ప్రజలకు సబ్సిడీపై చవకైన వైద్య సేవలు అందించే విషయంపై అమెరికా పార్లమెంటులో డెమోక్రాట్లకు, రిపబ్లికన్లకు మధ్య కొనసాగిన ప్రతిష్ఠంభన షట్‌డౌన్‌కు దారితీసి ఆర్థిక సేవలకు



అంతరాయం కలిగించిన విషయం తెలిసిందే. అక్టోబరు 1న ప్రారంభమైన ఈ షట్‌డౌన్ 43 రోజులపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఇంతకాలంపాటు ప్రభుత్వ సేవలు నిలిచిపోవడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. 2018-19 మధ్య దాదాపు 35 రోజులపాటు ప్రభుత్వం మూతపడింది.

### మళ్లీ చెలరేగిన హింస

# బంగ్లాదేశ్‌లో హై అలర్ట్



బంగ్లాదేశ్‌లో మరోసారి హింస చెలరేగింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకు గానూ మాజీ ప్రధాని షేక్ హసీనాపై నమోదైన కేసుల విషయంలో నవంబర్ 17న తీర్పు వెలువడనుంది. ఈ తీర్పు రానున్న సమయంలో పలుచోట్ల దాడులు జరుగుతున్నాయి. గత పరిణామాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రభుత్వం రాజధాని నగరం ఢాకాలో భద్రత పెంచింది. మరీ ముఖ్యంగా తీర్పును వెలువరించే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ చుట్టూ సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు. హసీనా పార్టీ అవామీ లీగ్ ఢాకాలో లాక్డౌన్‌కు పిలుపునిచ్చింది. దాంతో గురువారం పోలీసులు, బోర్డర్ గార్డ్ సెక్యూరిటీని భారీస్థాయిలో మోహరించారు. రాజధాని నగరంలోకి ప్రవేశించే మార్గాలవద్ద పలు చెక్ పాయింట్లను ఏర్పాటుచేసి, ముమ్మర తనిఖీలు చేస్తున్నారు.

# మునీర్‌కు 'సీడీఎఫ్' కవచం!

**- కేసులనుంచి రక్షణకే అపరిమిత అధికారాల పదవి**

**- రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఆమోదం**



పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు అపరిమిత అధికారాలు ఇచ్చేందుకు అక్కడి ప్రభుత్వం నిశ్చయించుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన అధికారాలు విస్తరించేందుకు అవసరమయ్యే రాజ్యాంగ సవరణకు అక్కడి పార్లమెంటు ఆమోదం తెలిపింది. కాగా, దీనిపై ప్రతిపక్షం ఆందోళన వ్యక్తం చేసింది. 27వ రాజ్యాంగ సవరణకు పార్లమెంటు దిగువ సభ మూడింట రెండొంతులకంటే ఎక్కువ మెజారిటీతో ఆమోదం లభించింది. కేవలం నలుగురు శాసనసభ్యులు మాత్రమే దీనికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఎగువ సభలో రెండురోజుల క్రితమే బిల్లుకు ఆమోదం లభించింది. రాష్ట్రపతి సంతకం అనంతరం ఇది చట్టంగా మారనుంది. దీని ప్రకారం.. ఆర్మీ చీఫ్‌గా ఉన్న ఆసిం మునీర్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో ఆయనకు జీవితకాల రక్షణ లభించనుంది. రాజ్యాంగ సవరణకు పార్లమెంటు ఆమోదం తెలిపిన అనంతరం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడారు. ఇది జాతీయ ఐక్యతకు కీలక అడుగుగా అభివర్ణించారు. వైమానిక, నావికాదళాల గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తాజా సవరణ ప్రకారం.. రాజ్యాంగ కేసులను నిర్వహించడానికి కొత్త ఫెడరల్ కాన్స్టిట్యూషనల్ కోర్టు ఏర్పాటుకానుంది. ఇందులో పాక్ సుప్రీం కోర్టు పాత్ర తగ్గనుంది. ఈ ఎఫ్‌సీసీకి న్యాయమూర్తులను ప్రభుత్వం నియమించనున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ప్రభుత్వ విధానాలను సుప్రీం అడ్డుకోవడంతోపాటు ప్రధాన మంత్రులను తొలగించింది. ఈ క్రమంలో ఈ ఎఫ్‌సీసీ ఏర్పాటుకు షరీఫ్ ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. పార్లమెంటు ఆమోదం తెలపడంపై ఇమ్రానఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్‌తో పాటు ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఓటింగ్ సమయంలో వీరు వాకౌట్ చేశారు.

# ప్రవాస డ్రైవర్లకు కష్టాలు

**కమర్షియల్ లైసెన్స్‌లను కఠినతరం చేస్తోన్న అమెరికా**

విదేశీయులకు వీసాలు జారీ చేసే ప్రక్రియను కఠినతరం చేస్తోన్న అమెరికా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రవాస డ్రైవర్లకు ఇచ్చిన 17,000 లైసెన్స్‌లను రద్దు చేయాలని కాలిఫోర్నియా ప్రభుత్వం యోచిస్తోంది. సెమీ ట్రక్, బస్సులను నడిపేందుకు అక్రమంగా లైసెన్సు పొందారని, కాలిఫోర్నియా అక్రమ వలసలకు అడ్డాగా మారుతోందని ట్రంప్ యంత్రాంగం ఆందోళన వ్యక్తంచేసిన నేపథ్యంలో ఈ వార్తలు రావడం గమనార్హం. అయితే కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ మాత్రం అది కారణం కాదని చెప్పారు. ఈ లైసెన్స్‌ల కాల వ్యవధి ముగిసిందని అధికారులు గుర్తించారని కాలిఫోర్నియా రాష్ట్ర రవాణా ఏజెన్సీ వెల్లడించింది. దీంతో ఆ ప్రభుత్వం కమర్షియల్ లైసెన్స్‌ల సమీక్ష మొదలు పెట్టింది. ఫ్లోరిడాలో ఒక డ్రైవర్ నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకోవడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో జాతీయస్థాయిలో డ్రైవర్ల లైసెన్స్‌లపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. టెక్సాస్, అలబామాలో కూడా ఈ ఏడాది ప్రారంభంలో ఇదేతరహా ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ లైసెన్స్ల విషయంలో పలు ప్రశ్నలు లేవనెత్తాయి. గత నెల కాలిఫోర్నియాలో ఒక ప్రవాస డ్రైవర్ మద్యంమత్తులో ప్రమాదానికి కారమణమయ్యాడు. అది కూడా తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే లైసెన్సుల రద్దుకు గవిన్ ప్రభుత్వం యోచిస్తోంది. గతంలో తన లైసెన్స్‌ల జారీ విషయంలో తన ప్రమాణాలను సమర్థించుకున్న కాలిఫోర్నియా.. ఇప్పుడు ఈ



నిర్ణయం తీసుకోవడం తమ తప్పులను అంగీకరించడమే అవుతుందని అమెరికా రవాణా మంత్రి విమర్శించారు, ఇదిలాఉంటే.. వాణిజ్య ట్రక్కులు నడిపే డ్రైవర్లకు వర్కర్ వీసాలు జారీ చేయమని ఆగస్టులో ట్రంప్ ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. "అమెరికా రోడ్లపై భారీ ట్రక్కులు నడిపే విదేశీ డ్రైవర్ల సంఖ్య పెరుగుతోంది. వీరి నిర్లక్ష్యం అమెరికన్ల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది. వీరితో అమెరికన్ ట్రక్కర్ల జీవనోపాధికి గండి పడుతోంది" అని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. డ్రైవర్లకు ఇంగ్లీష్ చదవడం, రాయడం వచ్చి ఉండటాన్ని తప్పనిసరి చేసింది. రోడ్లపై సూచికలు చదవకపోవడం, ఇంగ్లిష్ మాట్లాడకపోవడం వల్లే అనేక ప్రమాదాలకు డ్రైవర్లు కారణమవుతున్నారని ట్రాన్స్‌పోర్టు డిపార్ట్మెంట్ పేర్కొంది.

# 'మత్తు'బెట్టలేకపోయారు!

**తాలిబన్ల ఇలాకాలా అమెరికా ఆపరేషన్ ఫెయిల్ - ఇప్పుడు.. బాగ్రాంను సొంతం చేసుకోగలుగుతుందా?**



అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరాన్ని స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలకు తాలిబన్ ప్రభుత్వం ఏమాత్రం బెదరడం లేదు. ఇదేకాదు.. తొలినుంచి వారిని తుడిచిపెట్టాలని చూసిన ఏ దేశానికైనా కొన్నాళ్ల తర్వాత వెనక్కి తగ్గాల్సిన పరిస్థితే వచ్చింది. రష్యా, అమెరికాకు తాలిబన్లనుంచి అలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. వీరితో నేరుగా తలపడటంకంటే ఆర్థికంగా దెబ్బకొట్టడమే సరైందని భావించిన అమెరికా గతంలో 10 ఏళ్లపాటు కోవర్ట్ ప్రోగ్రామ్ నిర్వహించింది. వారి బిలియన్ డాలర్ల హెరాయిన్ వ్యాపారాన్ని ధ్వంసం చేసేందుకు సంకరం చేసిన గసగసాల విత్తనాలను రహస్యంగా రాత్రిపూట వారి పొలాల్లో వెదజల్లింది. అందుకోసం ట్రాన్స్‌పోర్టు ఎయిర్ క్రాఫ్ట్ సీ-130ని ఉపయోగించిందని వాషింగ్టన్ పోస్ట్ కథనం వెల్లడించింది.

అఫ్గానిస్థాన్‌లో ఓపియంను పండిస్తోన్న హెల్మండ్, నంగర్హర్ ప్రాంతాల్లో 2004 నుంచి 2015 వరకు అగ్రరాజ్యం ఈ కోవర్ట్ ప్రోగ్రామును చేపట్టింది. హెరాయిన్ వ్యాపారంలో నష్టపోయేలా ఉత్పత్తి, సామర్థ్యాన్ని తగ్గిస్తూ పాపీ సీడ్సును సంకరం చేసింది. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీకి చెందిన క్రైమ్ అండ్ నార్కొటిక్స్ సెంటర్ ఈ ప్రోగ్రాంను నిర్వహించిందని 14మంది మాజీ అధికారులు ధ్రువీకరించినట్టు ఆ కథనం పేర్కొంది.

"సైనికంగా సవాల్ విసురుతోన్న సమస్యకు యుద్ధరంగంలోకి దిగకుండానే పరిష్కరించే ప్రయత్నం ఇది" అని ఓ మాజీ అధికారి దీనిగురించి అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఆ సమయంలో ప్రపంచంలో 90 శాతం హెరాయిన్‌ను అఫ్గానిస్థాన్ ఉత్పత్తి చేసింది. దాంతో తాలిబన్లకు నిధులు వచ్చి పడ్డాయి. అందుకే హెరాయిన్‌లో కీలకమైన రసాయనం ఆల్కలైడ్ కంటెంట్‌ను తగ్గించేందుకు ఈ సంకరం చేసిన విత్తనాలను అమెరికా ఉపయోగించింది. రానురాను ఆ మొక్కలు స్థానిక జాతితో కలిసిపోతాయని అంచనా వేసింది. ఈ రహస్య కార్యక్రమం గురించి పెంటగాన్‌లోని కొందరు సీనియర్ అధికారులు, చివరకు అఫ్గాన్‌లోని హమిద్ కర్జాయ్ ప్రభుత్వానికి కూడా తెలియకపోవడం గమనార్హం. ఇక, కార్యక్రమం తాత్కాలిక విజయమే సాధించిందని, స్వల్ప ప్రభావాన్ని మాత్రమే చూపించిందని దానిగురించి తెలిసిన కొందరు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇది గొప్ప ఆలోచనే కానీ.. ఆచరణలో అనుకున్న ఫలితాన్ని మాత్రం పొందలేకపోయిందని పేర్కొన్నారు.

వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదుల దాడి అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 11, 2001లో (9/11) అల్‌ఖైదా జరిపిన మారణహోమంలో సుమారు మూడు వేలమంది ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు తాలిబన్ల అధీనంలో ఉన్న ప్రాంతాల్లోనే అల్‌ఖైదా తన కార్యకలాపాలు కొనసాగించింది. దీంతో ఆ ఉగ్ర సంస్థను మట్టుపెట్టేందుకు రంగంలోకి దిగిన అమెరికా.. 20ఏళ్లపాటు అఫ్గానిస్థాన్‌లో తన సైన్యాన్ని ఉంచింది. తాలిబన్లతో జరిగిన ఒప్పందంతో 2021లో ఆ దేశంనుంచి తన బలగాలను ఉపసంహరించుకుంది. దాంతో రెండు దశాబ్దాలపాటు కొనసాగిన పౌర పాలన పోయి మళ్లీ తాలిబన్లు అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ దాడులకు సూత్రధారి, అల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్‌ను ఉత్తర పాకిస్థాన్‌లో ఉన్నట్టు గుర్తించిన అమెరికా.. 2011లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి అంతం చేసింది.

# జాగ్రత్తలు చెప్పిన రాజమౌళి



ఇండియన్ సినిమా దగ్గర.. బిగ్గెస్ట్ సినిమా ఈవెంట్‌ని సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ప్రాజెక్టు కోసం ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. నవంబర్ 15న రామోజీ ఫిలిం సిటీలో అత్యంత ఘనంగా అట్టహాసంగా జరగనున్న ఈవెంట్ విషయంలో దర్శకుడు రాజమౌళి ఈవెంట్‌కి రావాలని అనుకుంటున్న వారికి ముందు జాగ్రత్తగా ఒక అలర్ట్ మెసేజ్ వీడియో రూపంలో ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చే వారు ఎవరైనా రామోజీ ఫిలిం సిటీ మెయిన్ గేట్‌నుంచి ఎలా రావాలి.. ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలి.. ఎంత త్వరగా వస్తే మంచిదనే అంశాలు జక్కన్న క్లుప్తంగా వివరించారు. అంతేకాకుండా ఈసారి ఈవెంట్‌లో 18 ఏళ్లలోపల, సీనియర్ సిటిజన్స్‌కి ఎలాంటి అనుమతి పోలీస్ యంత్రాంగంనుంచి లేదని క్లియర్ చేసేశారు. కేవలం పాసులున్న వారికే ఎంట్రీ ఉంటుందని, పాసుల విషయంలో వస్తోన్న రూమర్స్ నమ్మొద్దని చెప్పారు. మన సేఫ్టీని దృష్టిలో ఉంచుకొనే పోలీస్ యంత్రాంగం పని చేస్తోందని.. ఆరోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగినా ఈవెంట్ రద్దవుతుందని క్లియర్ చేశారు. దీంతో తన వీడియో ఇప్పుడు సినీవర్గాల్లో వైరల్‌గా మారింది.

# ఫస్ట్ సాంగ్.. తాండవమేనట



నందమూరి బాలకృష్ణ హీరోగా సంయుక్త ఇంకా హర్షాలీ మల్హోత్రా కీలక పాత్రల్లో దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రమే "అఖండ 2 తాండవం".మాస్‌లో నెక్స్ట్ లెవెల్ హైప్ వున్న సినిమా కోసం అభిమానులు ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తుండగా.. సినిమా కోసం చూస్తున్న ఫ్యాన్స్‌కి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ని తీసుకొస్తున్నారు. ఇలా ఫస్ట్ సింగిల్‌పై మరో క్రేజీ అప్డేట్‌ని మేకర్స్ అందించారు.నవంబర్ 14 సాయంత్రం 5 గంటలకి పీవీఆర్ జుహూలో మొదటి సాంగ్‌ని లాంచ్ చేస్తున్నట్టుగా వేదికని ఖరారు చేశారు. దీంతో అఖండ 2 పాన్ఇండియా లెవెల్ ప్రమోషన్స్‌ని మొదలు పెట్టుకున్నట్టేనని చెప్పాలి. ఇక చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుంటే.. 14 రీల్స్ ప్లస్ నిర్మిస్తోంది. డిసెంబర్ 5న సినిమా గ్రాండ్‌గా పాన్ఇండియా లెవెల్లో రిలీజ్‌కి రాబోతుంది.

# అందుకే.. ఇంటర్వ్యూలకు దూరం..



అగ్ర కథానాయిక రష్మిక ప్రస్తుతం సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఆమె నటించిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' ఆదరణను సొంతం చేసుకుంది. అయితే సినిమా ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఒక షోలో రష్మిక చేసిన కామెంట్స్ వైరల్ అయిన విషయం తెలిసిందే. మగవాళ్లకు కూడా జీవితంలో ఒకసారి పీరియడ్స్ రావాలని.. అప్పుడే ఆడవాళ్లుపడే బాధ అర్థమవుతుందని అన్నారు. ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ కావడంతో తాజాగా ఆమె తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. "ఈ విషయం గురించి ఎవరూ మాట్లాడరు. షోలు, ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే నాకు అందుకే భయం. నేను ఒక ఉద్దేశంతో మాట్లాడితే..దాన్ని మరోలా అర్థం చేసుకుంటున్నారు.పూర్తి భిన్నంగా అర్థం చేసుకుంటున్నారు" అని అన్నారు. రష్మిక కామెంట్సుకు ఆమె అభిమానులు మద్దతు తెలుపుతున్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు మొత్తం షేర్ చేయకుండా సగం మాత్రమే కట్‌చేసి షేర్ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీరియడ్స్ సమయంలో తాను భయంకరమైన నొప్పిని అనుభవిస్తానని రష్మిక తెలిపారు. "నేను ప్రతినెల ఈ నొప్పిని భరిస్తాను. ఒకసారి స్పృహ తప్పి పడిపోయాను. వైద్యుల దగ్గరకు వెళ్లి అన్ని చెకప్‌లు చేయించుకున్నాను. కానీ, వాళ్లు కూడా ఇది సాధారణమని చెప్పారు. 'దేవుడా ఎందుకు నన్ను ఇంత బాధ పెడుతున్నావు' అని ప్రతి నెలా అనుకుంటాను. ఎవరైనా దాన్ని అనుభవిస్తేనే తెలుస్తుంది. అందుకే పురుషులకు కూడా కనీసం ఒక్కసారైనా పీరియడ్స్ రావాలని నేను అనుకుంటున్నా" అని రష్మిక ఆ కార్యక్రమంలో స్పష్టం చేశారు.



# ఫినిషింగ్ షూట్‌లో చిరు ప్రాజెక్టు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.సంక్రాంతి 2026 సందర్భంగా ఈ భారీ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ గోల్ఫ్ కోర్టులో చిరంజీవిపై యాక్షన్ సీన్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ రెండు రోజుల పాటు కొనసాగనుండగా, దీని తర్వాత చిరంజీవి పాత్రకు సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుంది. ఇప్పటికే విడుదలైన తొలి సింగిల్ 'మీసాల పిల్ల' పాట పెద్ద హిట్‌గా మారి, అభిమానుల్లో మ్యూజిక్ ఆల్బమ్‌పై మరింత ఆసక్తి పెంచింది. కేథరిన్ థ్రెసా ముఖ్య పాత్రలో నటిస్తుండగా, ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న సినిమాలో విక్టరీ వెంకటేష్ ప్రత్యేక పాత్రలో కనిపించబోతున్నారు.

# అదే.. నా కెరీర్ మార్చేసింది



వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ'. 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయరంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగంమంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. "రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా? అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగంమంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు" అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. "పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలుండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుంది" అని అదా శర్మ చెప్పారు.

# ఘటికాచలం తిప్పలే.. ఆడియన్స్‌కి నవ్వులు



ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే లక్ష్యంగా కథలను అందిస్తోంది ఈటీవీ విన్. ఇప్పటికే ఓటీటీలో అనేక సినిమాలు ఆడియన్స్‌ను అలరించగా.. ఇప్పుడు మరో చిత్రం సిద్ధమైంది. వైవిధ్యమైన కథలను అందించే దర్శకుడిగా పేరున్న రవిబాబు డైరెక్షన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఏనుగుతొండం ఘటికాచలం'. ఇందులో నరేష్ ప్రధాన పాత్ర పోషించగా.. టాలీవుడ్‌లోని కమెడియన్స్ కీలక పాత్రలు పోషించారు. ఈటీవీ విన్ వేదికగా గురువారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. రిటైర్డ్ ఎంప్లాయ్ ఘటికాచలం తనకంటే చిన్న వయసున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవడం, ఆ తర్వాత ఎదురైన పరిణామాలతో ఇది రూపొందింది. ఆయన ఫించన్ డబ్బుల కోసం కొడుకులు ఏం చేశారనే నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయని చిత్రబృందం తెలిపింది.

# సంతాన ప్రాప్తిరస్తు.. డీసెంట్ మూవీ

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం "సంతాన ప్రాప్తిరస్తు". చిత్రాన్ని సంజీవ్ రెడ్డి డైరెక్ట్ చేస్తుండగా మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఈనెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాలో జాక్‌రెడ్డి అనే వైవిధ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు డైరెక్టర్, యాక్టర్ తరుణ్ భాస్కర్. రీసెంట్‌గా "సంతాన ప్రాప్తిరస్తు" మూవీ ప్రివ్యూ చూసిన తరుణ్ భాస్కర్ సినిమా చాలా బాగుందంటూ ప్రశంసించారు. సొసైటీలో ప్రస్తుతం ఉన్న ఇన్ ఫెర్టిలిటీ ఎలిమెంట్‌తో ఫన్, ఎమోషన్ కలిపి ఇలాంటి సినిమా చేయడం చాలా కష్టమని, "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా టీమ్ ఆ విషయంలో సక్సెస్ అయ్యారని తరుణ్ భాస్కర్ అన్నారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాలో నటిస్తున్నప్పుడు నాకు కొన్ని సందేహాలుండేవి. కానీ మూవీ చూశాక నా అనుమానాలు ఎగిరిపోయాయి. ఇదొక డీసెంట్ మూవీ. సరదాగా అలా మూవీ అంతా వెళ్లిపోయింది. ఇంట్లో చేసిన మంచి తెలుగు మీల్స్ తిన్నప్పుడు ఎలాంటి తృప్తి ఉంటుందో, అలాంటి ఫీల్ సినిమా చూస్తున్నప్పుడు కలిగింది. సినిమా ఎక్కడా హెవీగా అనిపించలేదు, ఓవర్ డ్రామా లేదు, సరదాగా చూస్తూ వెళ్లాను. డైరెక్టర్ సంజీవ్‌రెడ్డి చాలా క్లారిటీతో సినిమాను రూపొందించాడు. చైతన్య క్యారెక్టర్‌లో విక్రాంత్ పర్‌ఫెక్ట్‌గా కుదిరాడు. టీమ్ అంతా హానెస్ట్‌గా చేసిన వర్క్ స్క్రీన్ మీద కనిపిస్తుంది. ఈనెల 14న "సంతాన ప్రాప్తిరస్తు" తప్పకుండా చూడండి." అన్నారు.

